ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

7

శనివారం 18 అక్టోబరు 2025





జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఉమామహేశ్వర్

బీచ్‌లో ఈతపై నిషేధం

- సముద్రతీరంలో పటిష్ఠమైన భద్రత
- మందుబాబులు సముద్రంలో దిగరాదు
- పోలీసు అధికారుల సమీక్షలో ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సముద్ర తీర ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బీచ్‌ల్లో ఈతపై నిషేధం అమలు చేయాలని ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. తీర ప్రాంతాల్లోని పోలీసు అధికారులతో శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన సమీక్షలో ఎస్పీ పలు ఆదేశాలు జారీ చేశారు. మద్యం మత్తులో సముద్రంలో దిగడానికి వీలులేదన్నారు. తీరప్రాంతంలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై కఠినంగా వ్యవహరించాలన్నారు. సూచించిన ప్రదేశాల్లో మాత్రమే పర్యాటకులు స్నానాలు ఆచరించేలా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. ఆయాప్రాంతాల్లో పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వహించాలన్నారు. 167ఏ జాతీయ రహదారి త్వరలో అందుబాటులోకి వస్తే తెలంగాణ నుంచి ఎక్కువ సంఖ్యలో పర్యాటకులు ఓడరేవు, రామాపురం బీచ్‌లకు వచ్చే అవకాశం ఉందన్నారు. సూర్యలంక సముద్రతీరంలో పర్యాటకంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. రోజుల్లో బాపట్ల జిల్లా ప్రధానమైన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశం ఉన్నందున తీర ప్రాంతాల్లో పటిష్ఠమైన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల చోటు చేసుకున్న విషాదకర ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. తీరం వెంట లైఫ్‌జాకెట్లు, గజఈతగాళ్ల, మెరైన్‌పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సముద్రంలో పడవలు ద్వారా గస్తీ నిర్వహించాలన్నారు. ఈ నెల 22 నుంచి కార్తీకమాసం ప్రారంభం కానున్నందున పుణ్యస్నానాలకు భక్తులు తరలివస్తారని దీనిని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు జి.రామాంజనేయులు, ఎ.శ్రీనివాసరావు, ఎండీ మొయిన్, బాలమురళికృష్ణ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ, సీఐలు పి.సురేష్‌బాబు, కె.శ్రీనివాసరావు, శేషగిరిరావు, వైవి.రమణయ్య, ఎస్ఐలు పాల్గొన్నారు.

నేడు సాగర్ సందర్శనకు గవర్నర్

రూ.1.32 కోట్లు.. బయోస్టిమ్యులెంట్స్

అమ్మకాలు నిలిపివేత

8లో..

- 1.05 లక్షల ఎకరాల్లో తగ్గిన విస్తీర్ణం
- బర్లీ పొగాకు నిషేధం కూడా కారణమే
- వరి సాగుపై అన్నదాతల పునరాలోచన



పర్చూరు మండల పరిధిలో సాగుకు దూరంగా ఉన్న పొలం

ఖరీఫ్.. ఉఫ్

అదునులో వర్షాభావం.. ఆపై భారీ వర్షాలు.. వరదలతో ఖరీఫ్ కళ తగ్గింది. పచ్చని పైర్లతో కళకళలాడాల్సిన పొలాలు బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. ప్రకృతి విపత్తులకు తోడు ఏటికేడు పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు, ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలంటే గిట్టుబాటు ధరల భయం వెరసి ఖరీఫ్ సాగు కళ తగ్గింది. గతేడాది జిల్లాలో ఖరీఫ్ సీజన్ సాగు విస్తీర్ణం దాదాపు 3,22,000 ఎకరాలు ఉండగా, ఈ సీజన్ లో అది 2,67,000 ఎకరాలకు పరిమిత మైంది. బర్లీ సాగుపై నిషేధంతో ఆ పొలా లన్నీ కూడా దాదాపు ఖాళీగానే ఉన్నాయి. జిల్లాలో దాదాపు 1,05,000 ఎకరాలు సేద్యానికి దూరంగా ఉన్నట్లు గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. ఖరీఫ్ సాగు గణనీ యంగా తగ్గినా ఇప్పటి వరకు అధికారులు సమీక్ష నిర్వహించలేదంటే నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. వ్యవసాయశాఖ క్షేత్ర స్థాయిలో సర్వే చేసి ఏయే మండలాల్లో అధిక విస్తీర్ణం ఖాళీగా ఉంచారో గుర్తించి అక్కడ లాభసాటి సేద్యం వైపుగా అన్నదాతలను మళ్లించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నా వారు పట్టించుకోవడంలేదు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఈ ఏడు ఖరీఫ్ సాగు ప్రారంభ మైన మూడు వారాలకే వరదలు పొ లాలను ముంచెత్తాయి. ఇవి ఎక్కువగా బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజక వర్గాల పరిధిలోని రైతులపై తీవ్ర ప్రభావం చూపాయి. వ్యవసాయశాఖ గణాంకాల ప్రకారమే దాదాపు 68,000 ఎకరాల్లో వరి పైరు ముంపు బారిన పడినట్లు తేలింది. అప్పటికే ఎకరాకు రూ.7,000 నుంచి 10,000 వరకు ఖర్చు చేశారు. సాగు ప్రారంభంలోనే విపత్తు రైతును పలకరించింది. పైగా ప్రభుత్వం నుంచి రాయితీ విత్తనాల హామీ తప్ప మరె లాంటి భరోసా దక్క లేదు. దీంతో పలు ప్రాంతాల్లో రైతులు సాగుకు దూరంగా ఉన్నారు. గతేడాది పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో బర్లీ సాగైంది. జిల్లా వ్యాప్తంగా చూస్తే అది 62,000 ఎకరాల వరకు ఉంది. అయితే గత ఏడాది పరిణామాలతో ఖరీఫ్‌లో బర్లీ సాగుపై ప్రభుత్వం నిషేదం విధించింది. ఈ పరిస్థితుల్లో ఈ దఫా ఏమి సాగు చేయాలో తెలియని అయోమయస్థితిలో రైతులు ఉన్నారు. ప్రత్యామ్నాయ పంటలు వేయాలని ప్రభుత్వం ప్రకటించింది. అయితే అందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఎటువంటి ప్రణాళిక అమలు కాలేదు. దీంతో ఆయా భూములు సాగు లేక వెలవెలపోతున్నాయి.

కౌలు రైతులు వెనకడుగు

సాగు విస్తీర్ణంలో 75 శాతం కౌలు రైతులే చేస్తుంటారు. ఏటికేడే వారు అప్పుల్లో కూరుకుపోతుండడంతో ఈ ఏడాది వారు కూడా సాగుకు ఆశించిన స్థాయిలో ముందుకు రాలేదు. దీంతో ఖరీఫ్ సాగు గణాంకాలు తీసికట్టుగా దర్శనమిస్తున్నాయి. సీసీఆర్‌సీ కార్డుల జారీతోనే వ్యవసాయశాఖ సరిపెడు తుందే తప్ప దాని వల్ల కౌలు రైతులకు అందే ప్రయోజనం గుండుసున్నాగా కనబడుతోంది. దీనితో పాటు ప్రకృతి విపత్తులు వారిని కుదేలు చేస్తున్నాయి. దాని ఫలితమే ఈ ఏడాది ఖరీఫ్ సాగు అంచనాలకు ఆమడ దూరంలో నిలిచింది. ఈ ఏడాది ఈ-క్రాప్ నమోదులో ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులతో సేద్యానికి అనువుగా ఉండి ఖాళీగా ఉన్న భూములు కూడా రికార్డుల్లోకి ఎక్కుతున్నాయి. ఇది దాదాపు 50,000 ఎకరాలు వరకు ఉండొచ్చని తెలుస్తోంది.

ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా...

రైతులకు అన్ని విధాలుగా అండగా ఉండడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో పనిచేసే యంత్రాంగం నిర్లక్ష్యం వల్ల రైతుకు సేద్యం విషయంలో భరోసా ఎండమావిగానే మారింది. యూరియా నిల్వలు సమృద్ధిగానే ఉన్నాయని ప్రభుత్వం చెప్పినా క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ-క్రాప్ నమోదు దగ్గర నుంచి బీమా పరిహారం అందించే వరకు వ్యవస్థలు చేస్తున్న అనేక తప్పిదాలు రైతులకు గుదిబండలుగా మారాయి.

మాతా శిశు మరణాలను అరికట్టాలి

వైద్యాధికారులను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతృశిశు మరణాలు అరికట్టాలని వైద్యాధికారులను కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. మాతృ, శిశు మరణాల నివారణ జిల్లా స్థాయి కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. అద్దంకి, వేటపాలెం మండలాల్లో మాతృ మరణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాన్పుల సమయంలో మరణాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. విధినిర్వహణలో వైద్య విభాగం బాధ్యతగా వ్యవహరించాలన్నారు. గర్భిణులకు ఏడు నెల నుంచి గుండెపరీక్షలు తప్పనిసరిగా చేయాలన్నారు.

- ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని పగడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. పీఎమ్ఎస్ఎమ్ఏ అమలు తీరుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ ప్రసంగించారు. గర్భిణులకు ప్రతీ నెల 9న వైద్యపరీక్షలు విధిగా నిర్వహించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి స్పెషలిస్ట్ వైద్యులను అనుసంధానించాలన్నారు. సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు గర్భిణులకు అందాలని తెలిపారు.
- జలజీవన్ మిషన్ కింద ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని కలెక్టర్ తెలిపారు. గ్రామీణ నీటిసరఫరా, పారిశుధ్యంపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ఇంకా 2,15,808 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉందని డిసెంబరు 31కి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. జలజీవన్ మిషన్‌లో 64 పనులు ప్రారంభించని ఏజెన్సీలకు నోటీసులు జారీ చేయాలన్నారు. పురోగతి ఉన్న 277 పనులను ఆరు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. చెరువులు, పైపులైన్ల మరమ్మతులకు రూ.9.94 కోట్లు మంజూరు చేయాలని జడ్పీ డిప్యూటీ సీఈవోలను కలెక్టర్ ఆదేశించారు. తాగునీటి పథకాల మరమ్మతులకు నిధులు కేటాయించాలన్నారు.
- జిల్లాలో 308 మెట్రిక్‌టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. శుక్రవారం ఆర్ఎస్‌కేలు, పీఏసీఎస్‌ల ద్వారా 229 మెట్రిక్‌టన్నుల యూరియాను 2,412 మంది రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు.

జీడి.. జిగేల్



పిక్క దిగుబడి తగ్గడంతో ధరాభారం

వేటపాలెం(చీరాల), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జీడి పిక్క ధర అమాంతంగా పెరుగుతోంది. ఈ ఏడాది దిగుబడి తగ్గింది. దీంతో క్రమేపి ధర పెరుగుతూ వస్తోంది. చీరాల పరిసర ప్రాంతాల్లోని వేటపాలెం, పందిళ్లపల్లి, చల్లా రెడ్డిపాలెం, కఠారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం, రామన్నపేట ప్రాంతాల్లో వేల ఎకరా ల్లో జీడి సాగవుతోంది. గతేడాది 80 కేజీల పిక్క ధర సుమారు రూ.9 వేల నుంచి రూ.9.200 వరకు ఉంది. ప్రస్తుతం వ్యాపారులు రూ.11 వేల నుంచి రూ.12 వేలకు నాణ్యమైన రకం కొనుగోలు చేస్తున్నారు. పిక్కలను గ్రేడింగ్ చేసి పప్పుగా మార్చేం దుకు అదనంగా బస్తాకు రూ.3 నుంచి రూ.4 వేల వరకు కూలి భారం పడుతోంది. నగటున బస్తాకు దాదాపుగా 6 కేజీల తరుగు ఉంటుంది. బద్ద, గుండు, నూకగా వేరు చేయగా దాదాపు బస్తాకు 20 కేజీల పప్పు దిగుబడి మాత్రమే అందుతుంది. దీంతో ఖర్చులు, లాభాలను బేరీజు వేసుకుని కేజీ రూ.1250 నుంచి రూ.1300 వరకు దుకాణాదారులు విక్రయిస్తున్నారు.

నేడు సాగర్ సందర్శనకు రాష్ట్ర గవర్నర్

మాచర్ల రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున సాగర్‌ను శని, ఆదివారాల్లో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ సందర్శించనున్నట్లు తహసీల్దార్ బందెల కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. శనివారం నాగార్జున సాగర్ చేరుకుని.. హిల్ కాలనీలోని విజయ విహార్‌లో గవర్నర్ బస చేస్తారు. 19న లాంచీలో నాగార్జున కొండలోని బౌద్ధ స్థూపాలను, విజయపురిసౌత్ లాంచీ స్టేషన్, అనుపు, ఎత్తిపోతల జలపాతాలను సందర్శిస్తారు.

రూ.1.32 కోట్ల.. బయోస్టిమ్యులెంట్స్ అమ్మకాలు నిలిపివేత


గుంటూరులోని ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ మోహన్ రావు బృందం

గుంటూరు సిటీ, అక్టోబర్ 17(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో వ్యవసాయ శాఖ అధికారులు ఆరు బృందాలుగా ఏర్పడి శుక్రవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో సరైన పత్రాలు చూపించలేదన్న కారణంతో రూ.1.32 కోట్ల బయోస్టిమ్యులెంట్స్ అమ్మకాలు నిలిపి వేతకు ఆదేశాలు ఇచ్చినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. ఏడీఏలు నాగభైరు మోహన్ రావు, తోట శ్రీనివాసరావు, వి.కోటేశ్వరి, ఆర్.విజయబాబు, సీహెచ్ తిరుమల దేవి, ఐ.సునీత, ఏఓలు సునీల్, గౌతమ్ ప్రసన్న, ఖడ్గం రమణకుమార్, బుల్ల కిషోర్ తదితరులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

'మెలియాయిడోసిస్'కు మెరుగైన వైద్య సేవలు

● రెండు నెలల చికిత్సతో కోలుకున్న తురకపాలెం వాసి
● సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి


కోలుకున్న ఎలీషాతో డాక్టర్ రమణ యశస్వి, వైద్య బృందం

గుంటూరు మెడికల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో మెలియాయిడోసిస్ జ్వర బాధితులకు మెరుగైన వైద్య సేవలు లభిస్తున్నాయని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. తురకపాలేనికి చెందిన పసుమర్తి ఎలీషా (46) మెలియాయిడోసిస్ బారిన పడి జీజీహెచ్‌లో చికిత్సల ద్వారా ఆరోగ్యపరంగా కోలుకున్నాడు. శుక్రవారం అతడిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసిన సందర్భంగా సూపరింటెండెంట్ చాంబరులో డాక్టర్ రమణ యశస్వి విలేకర్లతో మాట్లాడారు. ఎలీషా మెలియాయిడోస్ బారిన పడి ఆగస్టు 21న చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌లో చేరినట్లు తెలిపారు. అతడి ఎడమ మోకాలిలోని సైనోవియల్ ఫ్లూయిడ్‌ను సేకరించి పరీక్షించి మెలియాయిడోసిస్‌కు కారణమైన బర్ఖల్‌దేరియా సూడోమల్లీ బ్యాక్టీరియాను గుర్తించినట్లు ఆయన చెప్పారు. ఆరు వారాల పాటు ఎలీషాకు ఐవీ ద్వారా మీరాపెనం యాంటీబయోటిక్ మందు ఇవ్వడంతో అతడు కోలుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం డిశ్చార్జి చేస్తున్నా, మరో ఆరు వారాలు అతడు ఓరల్ యాంటీ బయోటిక్ మందులు తీసుకోవాల్సి ఉందన్నారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలానికి చెందిన మరొక రోగికి కూడా మెలియాయిడోసిస్ పాజిటివ్ వచ్చిందని, ప్రస్తుతం అతడిని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రమణ వెల్లడించారు. ఈ వ్యాధి బారిన పడే వారిలో 80 శాతం మంది షుగర్ బాధితులే ఉంటున్నారని ఆయన తెలిపారు. దీర్ఘకాలంగా జ్వరాలతో బాధపడే తురకపాలెం వాసులు, షుగర్ రోగులు ఆలస్యం చేయకుండా చికిత్సలు పొందాలని ఆయన కోరారు. ఎలీషాకు చికిత్స అందించిన జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ ఉషారాణి, డాక్టర్ సి.వాసంతి, డాక్టర్ బబిత, డాక్టర్ జి.ప్రభాకర్, పీజీలు ఆశాజ్యోతి, వి.స్వర్ణను, ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ అనిల్‌ను డాక్టర్ రమణ అభినందించారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాశయం నీటిమట్టం శుక్రవారం నాటికి 589.00 అడుగులు ఉంది. ఇది 309.05 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,302, ఎడమ కాలువ ద్వారా 8,022, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 34,307, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,200, మొత్తం ఔట్‌ఫ్లో 53,131 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 36,531 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

1.0644 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో రెండు యూనిట్ల ద్వారా గురువారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0644 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు తెలిపారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్‌గేట్లకు గాను 3 గేట్లను 1.50 మీటర్ల మేర ఎత్తి 21,258, టేల్ రేస్ చానల్ ద్వారా 8,555 మొత్తంగా 29813 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 32,480 క్యూసెక్కుల నీరొస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 (పూర్తిస్థాయి) మీటర్ల మేర నీరుండగా.. ఇది 7.080 టీఎంసీలకు సమానమన్నారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 25,375 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుండి 39,221 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 25,375 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 8,138, పశ్చిమ డెల్టాకు 5,527, గుంటూరు చానల్‌కు 181 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎం-యూటీఎస్ పరికరాల ఆవిష్కరణ


మిషన్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్ఎం

గుంటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మొబైల్ అన్ రిజర్వుడ్ టిక్కెటింగ్ సిస్టమ్ పరికరాలను గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుదేష్ణ సేన్ ఆవిష్కరించారు. శుక్రవారం సాయంత్రం పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. దీని వల్ల ప్రయాణికులు యూటీఎస్/ ప్లాట్‌ఫాం టిక్కెట్లు పొందడం చాలా సులభతరం అవుతుంది. ఎం-యూటీఎస్ సహాయక్‌లు రైల్వేస్టేషన్ ఆవరణ నుంచి 500 మీటర్ల లోపల అన్ రిజర్వుడ్ టిక్కెట్‌లను ఈ పరికరం జారీ చేస్తారు. ప్రయాణికులు టిక్కెట్ చార్జీని నగదు/డిజిటల్ విధానంలో చెల్లించొచ్చు. దీని వల్ల రద్దీ సమయాల్లో క్యూలైన్ల బాధలు తప్పుతాయని సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. రైల్వే కమర్షియల్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

పల్నాడు బాలోత్సవం - 3 బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ దంపతులు

మాచర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో నవంబరు 29, 30 తేదీల్లో నిర్వహించనున్న పల్నాడు బాలోత్సవం - 3 బ్రోచర్‌ను శుక్రవారం మాచర్ల పట్టణంలో న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్, డైరెక్టర్ జున్నా శ్రీనివాస్ దంపతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలోత్సవ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు మాట్లాడుతూ.. సబ్ జూనియర్స్ జూనియర్స్ సీనియర్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. శాస్త్రీయ నృత్యం, పాటలు, వ్యాసరచన, కథ రచన, కథ విశ్లేషణ, కోలాటం, హ్యాండ్ రైటింగ్, సైన్స్ ప్రయోగాలు, స్పెల్ బీ, ఏకపాత్రాభినయం, మైము, మ్యూజిక్, మిమిక్రీ, డిబేట్, క్విజ్, లఘు నాటికలు, జానపద నృత్యం తదితర 65 అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. నవంబరు 15లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. కమిటీ ఇన్‌చార్జి ఆయేషా సుల్తానా, ఆర్గనైజేషన్ హెడ్ నెల్లూరి బ్రహ్మయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ కోట సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెంచుపేట హత్య కేసులో నిందితుడి అరెస్టు

తెనాలి క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చెంచుపేట వద్ద గత మంగళవారం జరిగిన హత్య కేసును 3వ పట్టణ పోలీసులు ఛేదించారు. శుక్రవారం పోలీస్ స్టేషన్ విలేకరుల సమావేశం నిర్వహించి డీఎస్పీ బి.జనార్దనరావు వివరాలు వెల్లడించారు. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం, కోరుతాడిపర్రుకు చెందిన జూటూరి తిరుపతిరావు (60)కి అదే గ్రామానికి చెందిన గండికోట వెంకటసుబ్బారావు (36)కి గ్రామంలోని రామాలయం, చేపల చెరువు విషయంలో సంవత్సరాలుగా వివాదం నడుస్తోంది. వెంకట సుబ్బారావు తండ్రి కాలం నుంచి గ్రామంలో తిరుపతిరావుకి మెజార్టీ మద్దతుతో పైచేయిగా నడుస్తోంది. దీనిని జీర్ణించుకోలేని వెంకటసుబ్బారావు పగ పెంచుకున్నాడు. ఈ క్రమంలో తెనాలికి మకాం మార్చి కూలి పనులు చేసుకుంటున్న అతను.. తిరుపతిరావు అనారోగ్యంతో తెనాలిలోని పెద్ద కుమార్తె వద్ద ఉంటూ వైద్యం చేయించు కుంటున్నాడని తెలుసుకున్నాడు. కొన్ని రోజులు రెక్కీ నిర్వహించి.. గత మంగళవారం తిరుపతిరావు చెంచుపేటలోని ఓ టిఫెన్ సెంటర్ వద్ద ఉండగా గుర్తించి కొబ్బరికాయల కత్తితో పాశవికంగా అతనిని నరికాడు. మృతి చెందాడని పూర్తిగా నిర్ధారించుకుని అక్కడ నుంచి స్కూటీపై పరారయ్యాడు. శుక్రవారం సోమసుందరపాలెం కాల్వ కట్ట రోడ్డు నుంచి వస్తున్నట్లు సమాచారంతో నిందితుడిని అదుపులోకి తీసు కున్నారు. నిందితుడు గతంలో కూడా పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసును రెండు రోజుల్లోనే ఛేదించిన సీఐ సాంబశివరావు, సిబ్బందిని అభినందించారు. ఎస్ఐలు కరిముల్లా, ఆనంద్ పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆటో

● ఒకరు మృతి.. ఇద్దరికి గాయాలు


సుగుణరాజు మృతదేహం

విజయపురిసౌత్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని ఆటో వెనుకగా ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా.. మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన మాచర్ల మండలం తాళ్లపల్లి కుడి కాలువ సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. మాచర్ల మండలం కొత్తూరులో హస్త కళల వారికి శిక్షణ ఇచ్చేందుకు వచ్చిన ట్రైనర్ ఎస్.సుగుణరాజు, ఫిలిప్, వంగడ రమేష్ కొత్తూరు గ్రామం నుంచి పోచం నరసింహరావు అనే వృద్ధుడి ఆటోలో మాచర్ల పట్టణానికి బయలుదేరారు. మార్గ మధ్యంలోని ఏడో మైలులో గిరిజన ఆశ్రమ పాఠశాల వార్డెన్ నాగమల్లీశ్వరి, మరో వ్యక్తి ఆటోలో ఎక్కారు. తాళ్లపల్లి సమీపంలోని కుడికాలువ వద్దకు రాగానే రోడ్డుపై నిలిపి ఉన్న లారీని ఆటో వెనుకగా ఢీకొట్టింది. దీంతో హస్తకళల ట్రైనర్ ఎస్.సుగుణరాజు (35) అక్కడికక్కడే మృతిచెందాడు. వార్డెన్ నాగమల్లీశ్వరి, ఫిలిప్‌లకు తీవ్ర గాయాలు, రమేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు విజయపురిసౌత్ ఎస్ఐ అశోక్ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

యడ్లపాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణం కాపలాదారునిపై దౌర్జన్యం చేసిన ఘటనపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యడ్లపాడులోని ఓ మద్యం దుకాణంలో ఎగువ ఎస్సీ కాలనీకి చెందిన రత్నబాబు కాపలాదారుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 4న రాత్రి 12గంటల సమయంలో గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై దుకాణం వద్దకు వచ్చి కాపలాదారుతో ఘర్షణ పడ్డారు. దీంతో రత్నబాబు పోలీసులకు ఫిర్యాదు చేయగా యువకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. శుక్రవారం నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావు మద్యం దుకాణం వద్దకు వచ్చి అక్కడ పనిచేస్తున్న వారిని విచారించారు. ఆయన వెంట ఎస్ఐ శివరామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

పట్టణ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ


స్టేషన్‌లో ఎస్పీ కృష్ణారావు, ఇన్‌చార్జి డీఎస్పీ రామకృష్ణ

వినుకొండటౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణ పోలీస్‌స్టేషన్‌ను పల్నాడు ఎస్పీ కృష్ణారావు మొదటి సారిగా శుక్రవారం సందర్శించారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పట్టణంలోని పాత బస్టీలో జరిగిన ఓ వివాహ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన ఘటనపై వివరాలు తెలుసుకున్నారు.

జిమ్ ట్రైనర్ ఆత్మహత్య

తెనాలి క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రకాశం రోడ్డులో ఉన్న ఓ జిమ్‌లో ట్రైనర్‌గా పనిచేస్తున్న యువకుడు ఇంటిలో ఉరి వేసుకున్నాడు. రూరల్ ఎస్ఐ ఆనంద్ వివరాల ప్రకారం.. తేలప్రోలుకు చెందిన పఠాన్ మహబూబ్ ఖాన్ (25) తన బంధువులకు చెందిన జిమ్‌లో ట్రైనర్‌గా పని చేస్తున్నాడు. వారి ఇంటిలోనే నివాసం ఉంటున్నాడు. గురువారం అర్ధరాత్రి తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉండగా మృతుని అమ్మమ్మ గుర్తించి.. కుటుంబ సభ్యులకు తెలిపింది. వెంటనే హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ప్రేమ విఫలం కావడమే ఆత్మహత్యకు కారణం అయి ఉండవచ్చునని, కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడాస్ఫూర్తికి నిదర్శనం.. మహిళల కబడ్డీ టోర్నమెంట్


విజేత జట్టుకు బహుమతుల ప్రదానం

తాడికొండ(లాం), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): క్రీడా స్ఫూర్తికి నిదర్శనం మహిళల కబడ్డీ టోర్నమెంట్ అని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం యోగా కో-ఆర్డినేటర్ డాక్టర్ డీ.సూర్యనారాయణ పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న మహిళల కబడ్డీ టోర్నమెంట్ రెండో రోజు శుక్రవారం ఉత్సాహంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ మహిళలు క్రీడా రంగంలో చూపుతున్న ప్రతిభ గర్వకారణం అన్నారు. క్రీడ లు విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి మూలం అన్నారు. కబడ్డీ వంటి సంప్రదాయ క్రీడలు మన సంస్కృతిని ప్రతిబింబిస్తాయని తెలిపారు. ప్రతి విద్యార్థిని క్రీడల్లో పాల్గొని ఆరోగ్యవంతమైన జీవితానికి దారితీయాలి అని పేర్కొ న్నారు. ఈ రోజు జరిగిన పోటీల్లో నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రథ మ బహుమతిని, తెనాలి జేఎంజే డిగ్రీ కళాశాల ద్వితీయ బహుమతిని, గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ అండ్ సైన్స్ విభాగం తృతీయ బహుమతిని, గుంటూరు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల చతుర్ధ బహుమతిని సాధించాయని తెలిపారు. కార్యక్రమంలో కళా శాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు, ఫిజికల్ డైరెక్టర్లు రాఘవయ్య, భాను ప్రకాష్, విశ్వవిద్యాలయం క్రీడా విభాగాధిపతి, తదితరలు పాల్గొన్నారు.

కోటప్పకొండ ఆలయ హుండీల ఆదాయం రూ.59.97 లక్షలు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : త్రికోటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం హుండీల కానుకల లెక్కింపు ఈఓ చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో ఆభరణాల తనిఖీ అధికారి పి.సైదమ్మాబాయి నిర్వహించారు. ప్రధాన హుండీల ద్వారా రూ.55,76,935లు, అన్నదానం హుండీ ద్వారా రూ.4,20,319లు, మొత్తం రూ.59,97,254లు(102 రోజులకు) వచ్చినట్లు ఈఓ డి.చంద్రశేఖరరావు తెలిపారు. వెండి 330, బంగారం 51.500 గ్రాములు, 96 అమెరికన్, 140 కెనడా, 100 యూఏఈ డాలర్లు హుండీల ద్వారా వచ్చినట్లు తెలిపారు.

విలువల ఆధారంగా..

నాయకత్వం పెంపొందించుకోవాలి

● ప్రొఫెసర్ బి.సుధాకర్ రెడ్డి



మాట్లాడుతున్న ఆచార్య సుధాకర్ రెడ్డి

గుంటూరు (విద్య) అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్య అనేది కేవలం జ్ఞాన సంపాదనకే పరిమితం కాకుండా, విలువల ఆధారంగా నాయకత్వాన్ని పెంపొందించుకోవాలని ఐసీఎస్ఎస్ఆర్ ఎస్ఆర్‌సీ హానరరీ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. సుధాకర్ రెడ్డి అన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో కల్టివేటింగ్ ఎథికల్ బిజినెస్ లీడర్స్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ బి. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. నేటి యువత వ్యాపారంలోకి అడుగుపెడుతున్నప్పుడు సామాజిక బాధ్యతతో కూడిన నైతిక విలువలే వారికి మార్గదర్శకాలు కావాలని సూచించారు. ఆధునిక మేనేజ్‌మెంట్ విద్యలో భారతీయ విలువలు, సాంప్రదాయ జ్ఞానం, నైతిక దృక్పథం, సుస్థిరతలను సమన్వయ పరచాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా వర్సిటీ మాజీ డీన్ ప్రొఫెసర్ ఎ. సూర్యనారాయణ, పుదుచ్చేరి యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ స్కూల్ ప్రొఫెసర్ యార్లగడ్డ శ్రీనివాసులు, ఐబీటీ హైదరాబాద్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎం. పి. గణేష్ , విజ్ఞాన్ వర్సిటీ వైస్ చాన్సలర్ పి. నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు పాల్గొన్నారు.

ఏఐతోనే భవిష్యత్తు ఉద్యోగాలు

● ఆచార్య సుబ్రహ్మణ్యం


ఆచార్య సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న రెక్టార్, రిజిస్ట్రార్

ఏఎన్‌యూ, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ప్రతి రంగం కృత్రిమ మేధతో ముడి పడి ఉందని అమెరికాలోని సాన్ డియాగో ఎక్సలెన్స్ ప్రెసిడెంట్, సీఈవో ఆచార్య ఎస్.ఆర్. సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఏఎన్‌యూ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో 'సమాజ ప్రయోజనాల కోసం కృత్రిమ మేధస్సు, కంప్యూటింగ్, కమ్యూనికేషన్స్, కన్స్యూమర్, ఎలక్ట్రానిక్స్‌లో సాంకేతిక పురోగతులు' అనే అంశంపై శుక్రవారం ఏర్పాటు చేసిన సదస్సుకు ప్రధాన వక్తగా ఆయన విచ్చేశారు. భవిష్యత్ ఉద్యోగాలన్నీ.. ఏఐ సాంకేతికతను అర్థం చేసుకునే నైపుణ్యాలపై ఆధారపడుతాయని సుబ్రహ్మణ్యం తెలిపారు. విద్యార్థులు ఏఐ, డేటా సైన్స్, కంప్యూటింగ్ వంటి రంగాల్లో సాంకేతికతను పెంచుకొని పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమను తాము సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య శివరామ ప్రసాద్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు. విద్య, పరిశోధన, సమాజ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం మాట్లాడుతూ విద్యార్థులు వర్సిటీ అందిస్తున్న సాంకేతిక అవకాశాలను సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. ప్రత్యేక అతిథి ఐఎంఆర్ఎఫ్ చైర్మన్ రత్నాకర్, ప్రిన్సిపల్ ఆచార్య లింగరాజు, సహాయక ప్రిన్సిపాల్ డాక్టర్ గోపీకృష్ణ, చంద్రమౌళి, ఉద్యోగ కల్పన సమన్వయకర్త డాక్టర్ తౌసీఫ్ అహ్మద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

1,550 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం


పట్టుబడిన రేషన్ బియ్యంతో అర్బన్ సీఐ

పొన్నూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న 1,550 కేజీల రేషన్ బియ్యంను అర్బన్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ సీఐ ఎల్.వీరానాయక్ కథనం ప్రకారం.. పట్టణంలో గస్తీ పోలీసులకు పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా గురించి సమాచారం అందింది. దీంతో ఎస్సై బి.శ్రీహరితో కలిసి సీఐ పట్టణంలో సోదాలు నిర్వహించారు. షరాబజార్ సమీపంలో ఒక ట్రాలీని ఆపగా.. ముగ్గురు పారిపోవడానికి ప్రయత్నించారు. షేక్ మెమన్‌బాష అలియాస్ రబ్బాని, మామిళ్ళపల్లి గ్రామానికి చెందిన అవ్వారు శ్రీనివాసరావు, నిజాపట్నంలోని శ్రీరామపురం గ్రామానికి చెందిన పేరు చందనం అంకమ్మ నాయుడును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వాహనంలో 31 బస్తాల్లో ఉన్న రేషన్ బియ్యం గుర్తించారు. పట్టణంలోని మునీర్ అనే రేషన్ డీలర్ నుంచి బియ్యం కొనుగోలు చేసి.. బోడపాడు గ్రామానికి చెందిన గోవతోటి ఆనంద వద్దకు తరలిస్తున్నట్లు పట్టుబడిన వ్యక్తులు వెల్లడించారు. పట్టుబడిన ముగ్గురితో పాటు రేషన్ డీలర్ మునీర్, బోడపాడుకు చెందిన ఆనంద్‌పై నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరా నాయక్ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	250.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	260.00

42,710 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 37,368 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 42,710 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,578 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	12600
334	10000	15000	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	14500	334	10500	15000
273	10500	13800	నెంబరు. 5	10000	14800
341	10000	15500	341	10000	15800
4884	----	----	4884	10000	14000
సూపర్ 10	----	----	సూపర్ 10	10000	14700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15300	తేజ	10000	15000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15200
బ్యాడిగి	10500	15600	దేవనూరు డీలక్స్	10500	14800
దేవనూరు డీలక్స్	10000	14700	తాలుకాయలు	5000	8000



నందిరాజుతోట గ్రామంలో రూ.60లక్షలతో నిర్మించే రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

గ్రామీణ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. మండలంలోని నందిరాజుతోట గ్రామంలో రూ.60 లక్షలు వెచ్చించి జీబీసీ రోడ్డు వరకు నిర్మించే లింకు రోడ్డు నిర్మాణానికి శుక్రవారం లాంఛనంగా శంకుస్థాపన చేశారు. పార్టీశ్రేణులతో కలిసి ఆప్రాంతంలో మొక్కలు నాటి నీరు పోశారు. నందిరాజుతోట గ్రామంలోని చెత్త నుండి సంపద తయారి కేంద్రంలో తయారు చేసిన వర్మికంపోస్టును పరిశీలించారు. గ్రామాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతుల రూపకల్పనే ధ్యేయంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ, నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివసాంబిరెడ్డి, జనసేన సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, సంగం డెయిరీ డైరెక్టర్ మరీదు వెంకటేశ్వరరావు, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ, కార్యదర్శి కూచిపూడి ఝాన్సీరాణి, గ్రామకమిటీ నాయకులు, ఎంపీడీవో బాబురావు, సెక్రటరి పల్నాటి శ్రీరాములు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నియంత్రణ లక్ష్యాలు పూర్తి చేయాలి

● టీబీ అధికారి డాక్టర్ వి.సోములనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న టీబీ అధికారి డాక్టర్ సోములనాయక్

బాపట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో హెచ్ఐవీ నియంత్రణ కొరకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ వి.సోములనాయక్ తెలిపారు. జిల్లా కార్యాలయంలో ఎయిడ్స్ నియంత్రణ చర్యలపై జిల్లాలోని ఐసీటీసీ, పీపీటీసీటీ, ఏఆర్‌టీ, డీఎస్ఆర్‌సీ, లింకు ఎఆర్‌టి, ఎన్జీవోలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో సోములనాయక్ మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవీ నియంత్రణ కొరకు పరీక్షలు పెంచాలని చెప్పారు. ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా హెచ్ఐవీ ఉన్న వారికి మందులు ఇవ్వాలన్నారు. సమావేశంలో క్లస్టర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఝాన్సీ బాషా, క్లినికల్ సర్వీస్ ఆఫీసర్ చైతన్య, కిరణ్, శశిధర్‌రెడ్డి, భానుప్రకాష్ పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూపు సభ్యులకు ఒక రోజు శిక్షణ

పిట్టలవానిపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండలప్రజాపరిషత్ అభివృద్ధి కార్యాలయ సమావేశపు హాలులో క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా వీవోఎస్‌లకు, డ్వాక్రా గ్రూపు సభ్యులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో సీహెచ్ శేఖర్ శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామ ప్రాంతాలలోని ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలలో భాగంగా విద్యుత్, పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత, సైడ్‌కాల్వల మరమ్మతులు అనే అంశాలపై డ్వాక్రా వీవోఎస్‌లు, డ్వాక్రాగ్రూపు సభ్యులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయులకు క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు

పిట్టలవానిపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు నీలిబంగారయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పిట్టలవానిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు జరుగుతాయని మండల విద్యాశాఖాధికారులు -1, 2 కె.శివబాబు, కె.రాజారత్నం సంయుక్తంగా తెలిపారు. ఈ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు ఆయా కాంప్లెక్స్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయినులు హాజరుకావాలని వారు కోరారు.

పాఠశాల విద్యార్థులకు సాయిల్ హెల్త్ ప్రోగ్రాం



మట్టినమూనాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బాపట్ల వ్యవసాయాధికారి వి.సుమతి

పిట్టలవానిపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాజీపాలెం జిల్లాపరిషత్ ప్రాంగణంలో శుక్రవారం 7, 8 తగరతి విద్యార్థులకు సాయిల్ హెల్త్ ప్రోగ్రాంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏపూరి భూపతిరావు మాట్లాడుతూ భూమి ఆరోగ్యం, భూసార పరిరక్షణ ప్రాధాన్యత గురించి వివరిస్తూ ఏయే పంటలకు ఎంత ఎరువులు వేయాలో భూసార పరీక్షల ద్వారా తెలుసుకోవచ్చు అని విద్యార్థులకు వివరించారు. బాపట్ల భూసార వ్యవసాయ పరీక్షా కేంద్రం అధికారి వి.సుమతి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు గ్రూపుగా ఏర్పడి సాయిల్ హెల్త్‌కార్డు, మొబైల్‌యాప్‌ను ఉపయోగించి పాఠశాల దగ్గరలో ఉన్న రైతుల పొలాల నుంచి మట్టినమూనాలు సేకరించి క్యూఆర్ స్కాన్ చేసి వాటి ఫలితాలను మొబైల్‌యాప్‌లో పొందుపర్చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.శారద, అధికారి శాంతి, ఏఈవో ఆర్ఎస్‌టిఎల్ సుజన, ఉపాధ్యాయులు ఆదినారాయణ, బి.కుమారి విద్యార్థులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్చాలి : ఎంపీడీవో

కర్లపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. కర్లపాలెం జాతీయ రహదారి పక్కన ఉన్న ఎస్టీ కుటుంబాల వారిని శుక్రవారం ఎంపీడీవో సందర్శించి బడిఈడు పిల్లలను వెంటనే బడిలో చేర్చాలని తల్లిదండ్రులకు తెలియజేశారు. సమీప పాఠశాల ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి పిల్లలను బడిలో ఆయన చేర్పించారు. పాఠశాలలోని మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



పిల్లలను బడిలో చేర్చాలని తల్లిదండ్రులకు సూచనలు చేస్తున్న ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు

ప్రధాని పర్యటన విజయం

కూటమి పాలనలో అపూర్వ ప్రగతికి నాంది : కొల్లా

బాపట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : దేశ ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటన విజయం కూటమి పాలనలో రాష్ట్రం సాధించబోయే అపూర్వ ప్రగతికి నాంది పలుకుతుందని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. ఈ విషయమై శుక్రవారం ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో అన్ని రంగాలు సర్వనాశనం అయ్యాయన్నారు. ఇప్పటికే గూగుల్ డేటా సెంటర్ భారీ పెట్టుబడులతో విశాఖలో ప్రధాని నరేంద్రమోదీ ఆశీస్సులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దార్శనికతతో, యువనేత లోకేశ్ నిర్విరామ కృషితో ఏర్పాటుకు ఎండీయూ కుదుర్చుకోవటం సాంకేతిక, ఆర్థిక రంగాలలో రాష్ట్ర ముఖ చిత్రాన్ని మార్చే మిరాకిల్‌గా మారిందన్నారు.

షాపింగ్ సందడి విజయవంతం చేయాలి

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా బాపట్లలో ఏర్పాటు చేసిన షాపింగ్ సందడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లోని వీక్షణ సమావేశం మందిరంలో శుక్రవారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్, ఇంటిగ్రేటెడ్ గవర్నమెంట్ ఆన్‌లైన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్, ఈపంట, స్వచ్ఛభారత్ మిషన్ ఓడిఎఫ్ ప్లస్ అంశాలపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ కార్యక్రమంలో భాగంగా నిర్దేశిత కార్యక్రమాలను ప్రణాళిక ప్రకారం నూరు శాతం నిర్వహించి డాక్యుమెంట్‌లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. బాపట్లలో ఏర్పాటు చేసిన షాపింగ్ సందడిని ప్రజలంతా సందర్శించి వస్తువులు కొనుగోలు చేయాలని తెలిపారు. షాపింగ్ సందడిలో సూపర్ జీఎస్టీలో సూపర్‌సేవింగ్స్‌లో వచ్చే డిస్కౌంట్‌తోపాటు అదనపు డిస్కౌంట్‌లను అందించటం జరుగుతుందని తెలిపారు. 500 రూపాయలకు పైబడి కొనుగోలు చేసినవారికి లక్కీడిప్ ఉంటుందని తెలిపారు.

● ఇంటిగ్రేటెడ్ గవర్నమెంట్ ఆన్‌లైన్ శిక్షణా తరగతులను ప్రభుత్వ ఉద్యోగులందరు వినియోగించుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. ప్లే స్టోర్ మొబైల్ యాప్ నుంచి కర్మయోగి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని శిక్షణా తరగతులు పూర్తి చేయాలన్నారు. బాపట్ల జిల్లా ఈ విషయంలో రాష్ట్రంలో 11వ స్థానంలో ఉందని ప్రతి ఉద్యోగి ఈ అవకాశాన్ని వినియోగించుకొని మొదటి స్థానంలో ఉంచే విధంగా చూడాలన్నారు.

● స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా జిల్లాను ఓడీఎస్ఎఫ్ ప్లస్ కింద ఉంచేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో విలేజ్ అసిస్టెంట్ ఇంజనీరు ఎస్‌బిఎమ్ 2.0ఎంఐఎస్‌యాప్ డౌన్‌లోడ్ చేసుకొని అందులోని అంశాలన్నిటిని ఎస్ అని తెలిపిన మీద ఓడిఎఫ్ ప్లస్ నిర్ధారణ వస్తుందని ఆదిశగా అధికారులు పనిచేయాలని తెలిపారు. ఓడిఎఫ్ ప్లస్ కింద రాష్ట్రంలో 18వ స్థానంలో ఉందని ఈ స్థానాన్ని మెరుగు పర్చటానికి అధికారులు కృషి చేయాలన్నారు. ఈపంటను 100 శాతం పూర్తి చేయాలని వాటిని సూపర్‌చెక్ చేయాలని ఆర్డీవోలకు, తహసీల్దార్‌కు ఎంపీడీవోలకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో సీపీవో షాలెంరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు, ఏఎవో అన్నపూర్ణ, ఎంఐఎస్ అధికారి శిల్ప తదితరులు పాల్గొన్నారు.

ఇసుక కొరతలేకుండా తగుచర్యలు తీసుకోవాలి

ప్రజల అవసరాలకు ఇసుక కొరత లేకుండా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గాజులలంక-1, 2, ఓలేరు ఇసుకరీచ్‌లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని ఓలేరు ఇసుకరీచ్ పై కోర్టు కేసు పెండింగ్‌లో ఉన్నందున ఆ రీచ్ నుంచి ఇసుక సరఫరా నిలిపివేయటమైనదని మైనింగ్‌శాఖాధికారి కలెక్టర్‌కు వివరించారు. జిల్లాల ప్రజల అవసరాలకు గాజులలంక ఇసుకరీచ్ నుండి మాత్రమే ఇసుక సరఫరా చేయబడుతుందని, వర్షాకాలం దృష్ట్యా భట్టిప్రోలు గాజులలంక స్టాక్ పాయింట్‌లలో 61,720 మెట్రిక్ టన్నుల ఇసుకను నిల్వ చేయటమైనదన్నారు. ఇప్పటి వరకు 46,564 మెట్రిక్ టన్నుల ఇసుకను ప్రజలకు సరఫరా చేయటమైనదని 15,156 మెట్రిక్‌టన్నుల ఇసుక నిల్వ ఉన్నదని, సుమారు రోజుకు 200మెట్రిక్‌టన్నుల ఇసుక గాజులలంక స్టాక్ పాయింట్ నుంచి సరఫరా చేస్తున్నట్లు ఇది 2 నెలల వరకు సరిపోతుందని వివరించారు. వర్షాకాలం పూర్తి అవుతున్నందున జిల్లా కొత్తరీచ్‌ల కొరకు అన్వేషించాలని కలెక్టర్ తెలిపారు. ఓలేరురీచ్‌పై ఉన్న కోర్టు కేసును త్వరగా పూర్తి చేసుకొని అందుబాటులోకి తెచ్చుకోవాలన్నారు. కృష్ణానది తీరప్రాంతం కొల్లూరు మండలం జువ్వలపాలెం గ్రామంలో 3,73,500 మెట్రిక్‌టన్నుల ఇసుక నిల్వ కొరకు ఎస్ఈఏసికి నివేదికలు పంపినట్లు వారి అనుమతులు వచ్చిన వెంటనే జువ్వలపాలెం ఇసుకరీచ్ అందుబాటులోకి వస్తుందని మైనింగ్ అధికారులు తెలిపారు. ప్రతి ఇసుక రీచ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఇసుక సరఫరా చేసే వాహనాల రిజిస్ట్రేషన్ జీపీఎస్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, గనుల శాఖ సహాయ సంచాలకులు రామచంద్ర, జిల్లా రవాణాశాఖాధికారి పరందామరెడ్డి, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ షేక్ సలీమాకు వినతిపత్రం అందజేస్తున్న ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై జరిగిన దాడికి నిరసన

బాపట్ల, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు శుక్రవారం బాపట్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ షేక్ సలీమాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుడ్డు వందనం, బాపట్ల పట్టణాధ్యక్షుడు తాళ్ళూరి రాజేష్, తగరపు రవి, మల్లవరపు గాంధీ, బెజవాడ సునీల్, గుడిపాటి శ్రీను, మట్లపూడి నరేష్, ఎం.సింహాద్రి, బెజవాడ విజయ్, ఏసుపాదం, రాయుడు, మరియదాసు, రామస్వామి, ఏలియా, చిన్న, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఆటల పోటీలు ప్రారంభం

కర్లపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యాజలి జడ్పీ ఉన్నత పాఠశాలలో బాపట్ల డివిజన్ స్థాయిలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం వాలీబాల్ ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. అండర్-17 బాలికల విభాగంలో పలు పాఠశాల విద్యార్థులు వాలీబాల్ ఆటల పోటీలలో పాల్గొన్నారు. పిట్టలవానిపాలెం, రేపల్లె జట్లకు వాలీబాల్ పోటీలు జరుగుతున్నాయి.



స్కూల్ గేమ్స్ ఆటల పోటీలలో పాల్గొన్న పలు పాఠశాల విద్యార్థులు

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈవో



విద్యార్థుల పురోగతిని అడిగి తెలుసుకుంటున్న ఎంఈవో శివబాబు

పిట్టలవానిపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపాలెం గ్రామపంచాయతీ పరిధిలో, పిట్టలవానిపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలను మండల ఇన్‌చార్జి ఎంఈవో-1 కె.శివబాబు శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల పాఠ్యాంశాలపై వారి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని మౌలికసదుపాయాలు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకొని, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తాతా నారాయణ, ఎం.శామ్యూల్ పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం ఫౌండేషన్ ద్వారా పేదలకు చేయూత

కర్లపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు చేయూతనందిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు, గ్రామ ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్ బాషా తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్లపాలెం పాతూరులోని ఒక నిరుపేద మహిళకు 10 కేజీలు బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ ఆయుబ్, పఠాన్ కరిముల్లా, షేక్ బాషా, బహదూర్ బాషా, రియాజ్ బేగ్, షేక్ హబీబ్, షేక్ ఉస్మాన్ పాల్గొన్నారు.

సరైన పత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం

పిట్టలవానిపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఎస్ఐ ఎం.వెంకట శివకుమార్ శుక్రవారం వాహనాలు తనిఖీ చేపట్టారు. సరైన పత్రాలు లేని వాహనచోదకులకు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు.

గ్రామాల శుభ్రతలో డ్వాక్రా గ్రూప్‌లు కీలకంగా ఉండాలి

చెరుకుపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను శుభ్రంగా ఉంచడంలో డ్వాక్రా గ్రూప్‌లు కీలకంగా వ్యవహరించాలని ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. 15 ఎల్ఎస్‌డిజీ థిమ్ 5 క్లీన్ అండ్ గ్రీన్‌పై డ్వాక్రా గ్రూపులకు, యానిమేటర్లకు చెరుకుపల్లిలోని సంపద సృష్టి కేంద్రంలో శుక్రవారం డీఆర్పీ సరోజిని వారికి శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి పంచాయతీ కార్యదర్శి జానకిరామయ్య, ఎంఆర్‌సీ పీవీఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

పెన్షన్ పంపిణీ నుంచి అంగన్‌వాడీలను మినహాయించాలి

వేమూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలను పెన్షన్ల డ్యూటీ నుంచి మినహాయించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం ఎంపీడీవో రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు బి.అగస్టీన్ మాట్లాడుతూ, మండలంలోని అంగన్‌వాడీలకు పెన్షన్ డ్యూటీల నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఇప్పటికే పని భారం పెరిగి టెన్షన్‌తో విధులు నిర్వహిస్తున్నారని వారికి ఐసిడిఎస్ విధులు మినహా మరే ఇతర పనులు అప్పగించవద్దని కోరారు. వెంటనే శిశు సంక్షేమ డైరెక్టర్ వారి ఉత్తర్వుల ప్రకారం అంగన్‌వాడీలకు పెన్షన్ డ్యూటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.సువర్ణ, ఎం.మేరీ, బొడ్డు జయప్రద, ఎం.విజయదుర్గ, టి.తిరుపతమ్మ పాల్గొన్నారు.

గ్రామాల్లో పచ్చదనం పెంపొందించాలి : ఎంపీపీ

అమృతలూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రాపర్ల నరేంద్రకుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా గ్రామీణ పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ అమోదించిన తొమ్మిది థీమ్‌లో క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ ఐదవ అంశంగా పేర్కొన్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా పర్యావరణాన్ని పరిరక్షించేందుకు చెట్లు పెంపకం, సేంద్రియ వ్యవసాయం, పునరుత్పాదక ఇంధన వనరుల వాడకం వంటివి చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషమాంబ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పండిత సుబ్బరాయశర్మ దంపతులకు రమా ఏకాదశి పూజ

వేమూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని గ్రామానికి చెందిన ప్రముఖ శైవాగమ పండితులు, ఆలయ వాస్తు సిద్ధాంతి జ్యోతిష్య శాస్త్రవేత్త శతాధిక ప్రతిష్ఠాపన ఆచార్య బ్రహ్మశ్రీ మామిళ్లపల్లి వెంకటసుబ్బరాయ శర్మ దంపతులను రమా ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం తెనాలి పట్టణంలోని అష్టలక్ష్మి ఆలయంలో పాద పూజ చేసి ఘనంగా సత్కరించారు. ఆలయ అర్చకులు నల్లూరి చక్రవర్తి దంపతులు పాదపూజ చేసి లక్ష్మీనారాయణ అంశగా దంపతులను విశేషంగా ఆగమ శాస్త్ర ప్రకారం పూజించారు. అనంతరం పట్టు వస్త్రాలు పుష్పమాలలతో అలంకరించారు. భక్త సమాజాల వారు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. అనేక మంది భక్తులు పాల్గొని దంపతి పూజ అనంతరం సుబ్బరాయ శర్మ నుంచి ఆశీర్వాదం పొందారు.

వృత్తి విద్యా విద్యార్థులకు ఇండస్ట్రీయల్ విజిట్

చెరుకుపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుళ్ళపల్లి జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ విద్యార్థులకు వృత్తి విద్యలో భాగంగా నిర్వహించిన ఇండస్ట్రీయల్ విజిట్ సందర్భంగా బ్యూటీ అండ్ వెల్‌నెస్ ట్రేడ్ విద్యార్థులకు అనూతేజ బ్యూటీపార్లర్‌లో పేషియల్ హెయిర్‌స్టైల్ మేకప్ పెడిక్యూర్‌మెనిక్యూర్ వంటి వివిధ బ్యూటీసేవలపై శుక్రవారం అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించి భవిష్యత్తులో స్వయం ఉపాధి అవకాశాలపై ప్రేరణ కల్పించే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.కవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో వృత్తి విద్యా ఉపాధ్యాయురాలు జే.శ్రీవిద్య, వృత్తి విద్యా సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 4వ ఫీడర్‌లో ఆర్‌డీఎస్ఎస్‌స్కీమ్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్న కారణంగా రాజేష్ థియేటర్, రింగురోడ్డు, హెచ్‌పీ కాలనీ, సోనోవిజన్ రోడ్డు, ఎంసీఏ హాలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నదని విద్యుత్ శాఖ డీఈ డి.శ్యామ్‌సుధాకరబాబు తెలిపారు. రేపల్లె రూరల్ పరిధిలోని నల్లూరు, నల్లూరుపాలెం, అరవపల్లి, పెనుమూడి, రుద్రవరం, శింగపాలెం, విశ్వేశ్వరం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఏర్పడనున్నదని ఆయన తెలిపారు.

● భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం కలుగుతుందని రేపల్లె డిప్యూటీ ఈఈ శ్యామసుందరబాబు శుక్రవారం తెలిపారు. మండల పరిధిలోని పెదపులివర్రు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8 నుంచి మధ్యాహ్న 2 గంటల వరకు ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

● చెరుకుపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 33/11కేవీ చెరుకుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ రాంబొట్లవారిపాలెం ఫీడర్, నడింపల్లి ఫీడర్‌లో విద్యుత్ సరఫరా శనివారం నిలిపివేయటం జరుగుతుందని ఏడీఈ ఎన్.సురేష్‌బాబు తెలిపారు. తుమ్మలపాలెం, బలుసులపాలెం, ఊచావారిపాలెం, మత్తివారిపాలెం, ఆరేపల్లి గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

రైల్వేబోర్డు చైర్మన్‌ను కలిసిన ఎంపీ తెన్నేటి



భారత రైల్వే బోర్డు చైర్మన్ సతీష్‌కుమార్‌తో ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రైల్వే అభివృద్ధి పనుల విషయమై శుక్రవారం ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ భారత రైల్వే బోర్డు చైర్మన్ సతీష్‌కుమార్‌ను కలిసి చర్చించారు. రేపల్లె నుంచి బాపట్లకు కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని, బాపట్ల, చీరాలలో వందేభారత్ రైలు ఆగే విధంగా చూడాలని, బాపట్ల, చీరాల రైల్వేస్టేషన్‌లను ఆధునీకరించి అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన అభ్యర్థన మేరకు గతంలో విజయవాడ నుంచి గూడూరు మధ్య నాల్గొవ లైన్ ఏర్పాటుకు సుమారు 3 వేల కోట్ల రూపాయలు, రేపల్లె నుంచి తెనాలి మధ్య డబ్లింగ్ రైల్వేలైన్ నిర్మాణానికి అనుమతి ఇచ్చినందుకు రైల్వే బోర్డు చైర్మన్ సతీష్‌కుమార్, రైల్వేశాఖా మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు.



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత

భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శుక్రవారం పంపిణీ చేశారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 10 మంది అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేట్ వైద్యశాలల్లో చికిత్స తీసుకున్నారు. వైద్య చికిత్స కోసం అయిన బిల్లులను ఎమ్మెల్యేకు చూపించి ఆర్థిక సాయం అందించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఆనందబాబు ముఖ్యమంత్రి సహాయనిధికి సిఫారసు చేశారు. అక్కడ నుంచి వచ్చిన మొత్తం రూ.6,65,758 చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ఆనందబాబు వేమూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబులకు తమ కృతజ్ఞతలు తెలిపారు.

మహిళల ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జరీనా పర్వీన్

వేమూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సామాజిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ జరీనా పర్వీన్ తెలిపారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎంఎన్ఏఆర్ అనే కార్యక్రమంపై ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల లేదా బాల్య వివాహం చేసుకున్నా ఇబ్బందులకు గురయ్యేది ఆడపిల్ల అని తహసీల్దార్ తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి లక్ష్మీదేవి మాట్లాడుతూ, ప్రభుత్వం నుంచి వస్తున్న అంగన్‌వాడీ సంతులిత ఆహారం గర్భిణులు, బాలింతలు పొందుకుని లబ్ధి పొందాలన్నారు. ఎంపీడీవో రవికుమార్ మాట్లాడుతూ, బాలింతలకు, గర్భిణులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పున్నారావు, చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ట్రస్ట్ ప్రోగ్రామ్ మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు, అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన యూనెక్స్ట్ శిక్షణ

చెరుకుపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నెలరోజులుగా గూడవల్లి టీఆర్‌సీ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సహకారంతో బెంగుళూరుకు చెందిన ఉన్నతి వారి ఆధ్వర్యంలో జరుగుతున్న యూనెక్స్ట్ శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఆంగ్ల భాషపై పట్టు, జీవన నైపుణ్యాలు, నైతిక విలువలు, ఇంటర్వ్యూలు, డిబేట్, పబ్లిక్ స్పీకింగ్, పర్సనాలిటీ డెవలమెంట్, జనరల్ సైకాలజీపై ట్రైనర్ కె.రామకృష్ణరెడ్డి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ముగింపు సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.శ్యాంప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణా కార్యక్రమాలతో విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన క్రమశిక్షణ అలవడి ఉన్నత స్థానాలను అధిరోహిస్తారన్నారు. ట్రైనింగ్ ఆఫీసర్ ఎ.శ్రీనివాసరావు, జీ.శివసుబ్రహ్మణ్యం, వై.అర్జునరావు, కె.దివ్య, ఐటీఐ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



శిక్షణ ముగించుకున్న విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

రేపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు కన్నెగంటి రమేష్ అన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని చెబుతున్నారే తప్పా ఆచరణలో సాధ్యం కావటం లేదన్నారు. నవంబరు 3 నుంచి తలపెట్టనున్న మున్సిపల్ సమ్మె విజయవంతం చేయాలని కోరారు. దశలవారీగా ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పడమట బిక్షాలు, శింగం వాణిశ్రీ, కోన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మండలాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచాలి : ఎంపీడీవో

నగరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : మండలాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచటం మనందరి బాధ్యత అని నగరం మండల అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. మండల అభివృద్ధి కార్యాలయంలో క్లీన్ అండ్ గ్రీన్ అంశంపై శుక్రవారం నిర్వహించిన శిక్షణ ముగింపు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ క్లీన్ అండ్ గ్రీన్ వలన ఉపయోగాలు, రోజువారి శానిటేషన్ వలన గ్రామాలు పరిశుభ్రంగా ఉంచటంతోపాటు అంటువ్యాధులు ప్రబలవని అన్నారు. అనంతరం శిక్షణా తరగతుల ఇన్‌చార్జ్ వై.రాంబాబు, కె.రవికుమార్ వారు మాట్లాడుతూ ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలనే అంశంపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని, పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంచటంలో మనపాత్ర కీలకం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ వారు కూడా పాల్గొన్నారు.

చినగాదెలవర్రులో సీపీఆర్‌పై అవగాహన



సీపీఆర్ విధానాన్ని వివరిస్తున్న అధికారి కోటేశ్వరరావు

చుండూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటు మరణాలను నివారించడంలో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వేటపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి పోలే కోటేశ్వరరావు తెలిపారు. చినగాదెలవర్రులో గ్రామస్థులకు హృదయ శ్వాసకోస పునరుజ్జీవ చర్య విధానంపై శుక్రవారం అవగాహన తరగతులు నిర్వహించారు. ప్రాథమిక వైద్యమైన కృత్రిమ శ్వాస విధానం ప్రతివారు తెలుసుకోవాలని వివరించారు. వైద్య సిబ్బంది షేక్ జాన్‌బీ, భూలక్ష్మి, కీర్తి, శ్రీకాంత్, మధురవాణి తదితరులు పాల్గొన్నారు.

వీరుల గాధలో.. పరిఢవిల్లిన ఆధ్యాత్మికం

పల్నాడు అంటే దాయాదుల పోరు.. శైవ, వైష్ణవ మత సంఘర్షణలు.. ఎందరో వీరుల మరణాలు.. ఇదే చాలా మందికి తెలుసు.. కానీ పల్నాట 12వ శతాబ్దంలోనే సర్వమత సమానత్వం.. ఆధ్యాత్మిక చింతన పరిఢవిల్లిందనే విషయం అతి కొద్ది మందికే అవగతం. నాటి గుర్తులు నేటికీ పదిలంగానే ఉన్నాయి. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే భావితరాలకు చరిత్రను అందించడంతోపాటు దేశ చరిత్రలో మన కంటూ స్థానం సంపాదించవచ్చు. రాజులు, రాజ్యాలు, వీరులు, వీరగాథలు.. తనలో ఇముడ్చుకుంది నాటి కార్యమపూడి.. నేటి కారంపూడి.

- కారంపూడి, ఆంధ్రజ్యోతి

- పల్నాట సర్వమత సమానత్వం
- నాటి సాక్ష్యాలు నేటికీ సజీవం
- ఆధ్యాత్మికం.. ఆహ్లాదం మేళవింపు
- నాటి కార్యమపూడి.. నేడు కారంపూడి
- పర్యాటకం.. ప్రశ్నార్థకమేనా..?

మంత్రాలమ్మ కనుమ

నాటి కార్యమపూడి నేడు కారంపూడిగా పిలువబడుతోంది. యుద్ధ భూమికి దక్షిణ భాగాన నాలుగు మైళ్ల దూరంలో ఉన్న మంత్రాలమ్మ కనుమను నాయకురాలి కనుమగా పిలుస్తుంటారు. అక్కడ మంత్రాలమ్మ అమ్మవారి దేవాలయం పల్నాటి యుద్ధం జరిగిన 1184కు పూర్వమే ఉంది. ఈ అమ్మవారి దేవాలయాన్ని మహిమ గల దేవతగా ఆ నాటి నుంచి ఈ ప్రాంత వాసులు కొలుస్తుంటారు. పల్నాటి యుద్ధానికి తన సైన్యంతో బ్రహ్మనాయుడు త్రిపురాంతకం వద్ద ఉన్న మేడపి నుంచి తరలివస్తుంటాడు. సమాచారం తెలిసిన నాయకురాలు నాగమ్మ.. బ్రహ్మన్న సైన్యాన్ని యుద్ధ భూమికి రానీవ్వకుండా మంత్రాలమ్మ కనుమ వద్ద రహదారి లేకుండా చేస్తుంది. దీనికి ఆగ్రహించిన బ్రహ్మనాయుడు కనుమ వద్దనున్న కొండను తన ఆయుధమైన నృసింహకుంతంతో నరికి దారి చేసుకొని సైన్యాన్ని ముందుకు నడిపించాడు. నాయకురాలు నాగమ్మ అడ్డు వేయడంతో ఈ మంత్రాలమ్మ కనుమకు నాయకురాలి కనుమగా పేరొచ్చిందని చరిత్రకారులు చెబుతున్నారు. బ్రహ్మనాయుడు కుమారుడైన బాలచంద్రుడు ఈ కొండపై నుంచే తన గుర్రాన్ని దూకించాడని ఆ ప్రదేశంలో చూపిస్తుంటారు. ఇప్పటికీ వీరాచార వంతులు ప్రతి ఆదివారం మంత్రాలమ్మ అమ్మవారికి పూజాదులు చేసి నివేదనలు అర్పిస్తుంటారు. మహిమ గల శక్తి అమ్మవారుగా ఈ ప్రాంత వాసుల నమ్మకం.

చెన్నకేశవస్వామి ఆలయం

కారంపూడిని మాచర్ల, గురజాల రాజులు తమ యుద్ధభూమిగా నిర్ణయించకముందే ఇరు రాజ్యాల రాజులు కారంపూడికి వస్తుంటారు. కారంపూడిలో చెన్నకేశవస్వామి దేవాలయాన్ని బ్రహ్మనాయుడు నిర్మించారు. శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి దర్శనానికి వచ్చేటప్పుడు బ్రహ్మనాయుడు తన మేడలో విశ్రమించేవారు. చెన్నకేశవస్వామి దేవాలయంలో ఒక బావి ఉంది. గంగధార మడుగులో స్నానమాచరించి నేరుగా ఈ బావి నుంచి వెలుపలకు వచ్చి చెన్నకేశవస్వామిని దర్శించేవారని చరిత్రకారులు చెబుతున్నారు. కాగా ఈ బావి ప్రస్తుతం మూసివేశారు.



యుద్ధభూమి

ఈ బావిలో నీరు తీర్థంగా తాకితే ఎక్కడలేని పౌరుషం పుట్టుకొస్తుందని, అందువల్ల అనర్థాలకు దారితీస్తుందని మూసి వేశారని చెబుతారు. వీరారాధన ఉత్సవాలు లేని సమయంలో బ్రహ్మనాయుడు నృసింహ కుంతం, కన్నమదాసు భైరవఖడ్గం, బాలచంద్రుడి సామంత రాగోల ఆయుధాలు ఈ దేవాలయంలోనే భద్రపరుస్తారు. ఉత్సవాల సమయంలో వీరాచార వంతులు తమ కొణతములతో చెన్నకేశవస్వామి ఆరాదిస్తారు. బ్రహ్మనాయుడు ఈ ఆలయంలోనే సర్వమత సమానత్వం కొరకు సహపంక్తి భోజనాలు పెట్టేవారు. క్రీస్తు శకం 1315లో ఈ ఆలయ పునరుద్ధరణ జరిగినట్లు కథనం.



కోట బురుజు

రాక్షస సొరంగాలు..

పెదకొదమగుండ్ల రహదారిలో ఆనాటి రాక్షస సొరలు (సొరంగాలు) నేటికీ కనిపిస్తున్నాయి. ఆ ప్రాంతంలోనే బ్రహ్మనాయుడు పులిజూదం ఆడిన ప్రదేశం కనిపిస్తుంది. కాగా గురజాల రాజ్యంగా పాలిస్తున్న మంత్రి నాయకురాలి నాగమ్మ తన సైన్యంతో కారంపూడి యుద్ధ భూమికి తరలి వచ్చేటప్పుడు ఈ రాక్షస సొరంగాల గుండా రాక్షస బండకు చేరుకొని విశ్రమించారని చరిత్రకారులు చెబుతున్నారు. 12వ శతాబ్దపు జ్ఞాపకాలు చారిత్రక చిహ్నాలు నేటికీ సజీవంగా కనువిందు చేస్తున్నాయి.

ముస్లింలు నిర్మించిన వీర్ల దేవాలయం



పల్నాటి యుద్ధం అనంతరం ఔరంగజేబు సైనికులు కారంపూడి మీదుగా వెళ్తూ యుద్ధ భూమిలో విశ్రమించారు. వీరుల రాతి చిహ్నాలను రాళ్లుగా బావించి వంటావార్పు చేశారు. భోజనం అనంతరం సైనికులు నురగలు కక్కుతూ పడిపోగా చెన్నకేశవస్వామి వృద్ధ బ్రాహ్మణుడి రూపంలో అక్కడకు వచ్చి వీరుల చరిత్రను వివరించి వారిని కాపాడినట్లు చరిత్ర చెబుతోంది. దీంతో జాఫర్, ఫరీద్ అనే సోదరులు యుద్ధ భూమిలో వీర్ల దేవాలయం నిర్మించి అక్కడే జీవసమాధి పొందారు. హిందూ దేవాలయంలో ముస్లింల సమాధులు ఉండడం, ఆ సమాధుల వద్ద నేటికీ ప్రజలు పూజలు నిర్వహిస్తుండడం విశేషం. కాగా ఈ ఆలయంలో కన్నమదాసు (మాల సామాజిక వర్గీయుడు)కు గుడి కూడా ఉంది. 12వ శతాబ్దంలోనే పల్నాటి బ్రహ్మనాయుడు సర్వమత సమానత్వం పాటిస్తూ చాపకూడు (సహపంక్తి భోజనాలు) నిర్వహించారనే చారిత్రక ఆధారాలున్నాయి. నేటికీ వీరారాధన ఉత్సవాల్లో వీర్ల గుడి ప్రాంగణంలో కుల, మత భేదాలు లేకుండా అందరూ కలిసి చాపకూడులో పాల్గొంటారు.

నాగులేరులోని గంగధార మడుగు..

వీర్ల దేవాలయ సరిహద్దులో దక్షిణం నుంచి ఉత్తరంగా ప్రవహిస్తోంది నాగులేరు. ఇక్కడ నాగులు అనే జాతి వారు నివసించారని, అందుకే దీనికి నాగులేరు అనే పేరు వచ్చిందంటారు. ఈ నాగులేరులో నీటి మడుగు అంతరవాహినిగా ఉంది. ఆ మడుగునే గంగధారి మడుగు అని వ్యవహరిస్తుంటారు. ఉత్తర వాహినిగా ప్రవహించే నదిని పుణ్యనది అంటారు. ఈ నదినే కాశిలోని మణికర్ణిక ఘాట్‌తో శ్రీనాథ మహాకవి పోల్చారు. ఈ మడుగులో వీరాచారవంతులు స్నానాథులు చేయడమే కాకుండా తమ ఆయుధాలకు ఈ మడుగులో స్నానమాచరింపజేస్తారు. కోట బురుజు నుంచి బాలచంద్రుని పొట్టేలు దూకగా పడిన గిట్టల గుర్తులు ఇప్పటికీ ఉన్నాయి. ప్రజలు ఇప్పటికీ ఈ గుర్తుల వద్ద పూజలు చేస్తుంటారు.



మంత్రాలమ్మ అమ్మవారు

మరికొన్ని ముఖ్య ప్రదేశాలు

కాగా కారంపూడిలో సందర్శించవలసిన మరికొన్ని ముఖ్య ప్రదేశాలు ఉన్నాయి. యుద్ధభూమికి ఎదురుగా పల్నాటి యుద్ధానికి పూర్వమే అంకాళమ్మ దేవాలయం ఉంది. ఈ దేవాలయ కిటికీలో నుంచి అమ్మవారు యుద్ధం వీక్షిస్తూ వీరుల మరణాలకు చలించి తల ఒరిగిపోయి కన్నీరు కార్చింది. అమ్మవారి కన్నీరు కింద పడితే అరిష్టమని ఆనాడు పూజారులు గిన్నెను అమర్చారు. ఇప్పటికీ గిన్నె అలానే ఉంది. అలాగే కన్నమదాసు మేడ, వీర్ల దేవాలయంలోని నాటి వీరుల ఆయుధాలు, బ్రహ్మనాయుడు ప్రతిష్ఠించిన కాలభైరవుని విగ్రహం, శంకుతీర్థ మండపం, కల్లి తోరణం, కారంపూడి గ్రామానికి రక్షణ కోసం వేసిన ముగ్గు, బ్రహ్మనాయుడు మేడ, బ్రహ్మనాయుడు పులిజూదం ఆడిన ప్రదేశం, బాలచంద్రుడు విశ్రమించిన ప్రదేశం, పోతురాజు మండపం, రాక్షసబండ ఇలా అనేకం ఉన్నాయి. పర్యాటక ప్రాంతంగా కారంపూడిని అభివృద్ధి చేస్తే నాటి చరిత్రను బావితరాలకు అందించడంతోపాటు దేశ చరిత్రలో సముచిత స్థానం కల్పించినట్లవుతుందని పల్నాటి వాసులు కోరుతున్నారు.

కల్తీ వరి విత్తనాలతో.. రోడ్డెక్కిన రైతులు

కొల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కల్తీ వరి విత్తనాలతో నష్టపోయిన రైతులు రోడ్డున పడ్డారని, వారికి న్యాయం చేయాలంటూ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని అనంతవరం గ్రామానికి చెందిన 35 మంది రైతులు రైతు సంఘం ఆధ్వర్యంలో కొల్లూరులోని వ్యవసాయ కార్యాలయానికి చేరుకుని తమకు జరిగిన అన్యాయం గురించి ప్రశ్నించి, ఏవో సురేంద్రబాబుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ.. పది రోజుల క్రితం ఎన్నార్జై విత్తన సంస్థ అందించిన బీపీటీ విత్తనాలు బెరుకు ఉందని రైతులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందించడం జరిగిందన్నారు. దీంతో మండల వ్యవసాయాధికారి అనంతవరంలో బెరుకు వచ్చిన వరి పైర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎన్నార్జై విత్తన పరిశోధన ప్రతినిధులతో చర్చించారని తెలిపారు. వారు కూడా గ్రామానికి చేరుకుని రైతుల సమక్షంలో పంట పరిశీలన అనంతరం పంటలో బెరుకు వచ్చిన మాట వాస్తవమని ఎకరాకు ఐదు బస్తాల వరకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని, తమ సంస్థ ఉన్నత స్థాయి ప్రతినిధులతో చర్చించి న్యాయం చేస్తామంటూ 15వ తేదీ వరకు గడువు కావాలని కోరారన్నారు. దానికి అంగీకరించిన రైతులు.. ఇప్పుడు తమకేం సంబంధం లేదని విత్తన సంస్థ ప్రతినిధులు చేతులు ఎత్తి వేయడంతో న్యాయం చేయాలంటూ వ్యవసాయ కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేశారు. వినతి పత్రం ఇచ్చినా ఏవో పట్టించుకోకపోవడంతో కడుపు మండిన రైతులు న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్ వద్ద తెనాలి - రేపల్లె ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోళ్ల నాగరాజు, మండల నాయకులు సుబ్బారావు, రైతులు ధూళిపాళ్ల రవి, జాలాది రంగారావు, నాగళ్ల కృష్ణారావు, ధూళిపాళ్ల చిన్న, కొల్లూరు నాగశ్రీధర్, నాగళ్ల రాంబాబు, ధూళిపాళ్ల నాని, కౌలు రైతులు రామకోటయ్య, వాసు, రామారావు, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట బైఠాయించిన అనంతవరం గ్రామ రైతులు

సీటు.. వదిలేది లేదు!

- డీఎంహెచ్‌ఓ ఆదేశాలు బేఖాతర్
- వైద్యాధికారి తీరుపై ఆరోగ్య శాఖలో విస్మయం
- ప్రజా ప్రతినిధి వద్దకు క్యూ కడుతున్న నేతలు

గుంటూరు సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో వింత పరిస్థితి ఏర్పడింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఇచ్చిన ఆదేశాలను ఒక వైద్యాధికారి పక్కన పెట్టడంపై విస్మయం వ్యక్తం అవుతోంది. వివరాల్లోకి వెళ్తే.. పెదనందిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఒక వైద్యునిపై రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులకు పలు ఫిర్యాదులు వెళ్లాయి. ఆ మండలానికి చెందిన నాయకులు కూడా ముఖ్య ప్రజా ప్రతినిధి వద్దకు వెళ్లి సదరు ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న విషయాలను వివరించారు. దాంతో విచారణ నిర్వహించిన జిల్లా అధికారులు సంబంధిత వైద్యుని డ్రాయింగ్ పవర్స్‌ను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వివాదాస్పద వైద్యుని డ్రాయింగ్ పవర్స్ తొలగించి, అదే ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న మరో వైద్యురాలికి బాధ్యతలు అప్పగిస్తూ సెప్టెంబరు 16న డీఎంహెచ్‌ఓ కె విజయలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. డీఎంహెచ్‌ఓ ఆదేశాలు ఇచ్చిన వెంటనే వాటిని అమలు చేయాల్సి ఉండగా మహిళా వైద్యురాలిని పెదనందిపాడు ఆరోగ్య కేంద్రంలోని కొందరు ఉద్యోగులు బెదిరిస్తున్నట్లు వార్తలు బయటకు రావడం చర్చనీయాంశమైంది. డీఎంహెచ్‌ఓ ఆదేశాలకు అనుగుణంగా చార్జి అప్పగించకుండా కాలయాపన చేయడం.. మహిళా వైద్యురాలిని కొందరు బెదిరిస్తూ ఉండటంతో అక్కడ ఉన్న నేతలు మళ్లీ ప్రజా ప్రతినిధి వద్దకు వెళ్తున్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉంటే అనేక వివాదాలకు కేంద్ర బిందువుగా ఉన్న వైద్యున్ని ఫిరంగిపురం బదిలీ చేసినట్లు ఉత్తర్వులు జారీ చేశారని కూడా తెలిసింది. ఈ విషయాలను డీఎంహెచ్‌ఓ కె.విజయలక్ష్మి దృష్టికి తీసుకు వెళ్లగా పెదనందిపాడు పీహెచ్‌సీ డ్రాయింగ్ పవర్స్ డాక్టర్ ప్రియం వదకు వెంటనే ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశానని చెప్పారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

పంచాయతీ సెక్రటరీ



వింటేజ్ కపుల్ శివాజీ, లయ మరోసారి కలసి నటిస్తున్న చిత్రం నిర్మాణదశలో ఉంది. ఈటీవీ విన్‌తో కలసి శివాజీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయన పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్‌గా నటిస్తున్నారు. దీపావళి పండగ సందర్భంగా ఈ చిత్రం నుంచి శివాజీ లుక్ విడుదల చేశారు. తన కుటుంబంతో కలసి దీపావళి పండగ సెలబ్రేట్ చేసుకోవడానికి పటాసులు తీసుకెళుతున్న లుక్ అది. అన్యాయాన్ని సహించని వ్యక్తిగా, నిజాయతీపరుడిగా శివాజీ ఇందులో నటిస్తున్నారు. భార్యాబిడ్డలే అతని ప్రపంచం, వాళ్ల కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడని వ్యక్తి పాత్రలో శివాజీ అభినయం ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు సుధీర్ శ్రీరామ్ చెప్పారు. చిత్రం టైటిల్, ఇతర విశేషాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. అలీ, ధనరాజ్, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

వంద శాతం హిట్ కొడతాం



సుధీర్ బాబు

సుధీర్ బాబు ప్రధాన పాత్రధారునిగా దర్శక ద్వయం వెంకటేశ్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'జటాధర'. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. తాజాగా ప్రిన్స్ మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో భూత పిశాచాలు, శాపగ్రస్త ఆలయాలు, ఆధ్యాత్మిక యుద్ధాలను కళ్లు తిప్పుకోలేని విధంగా చూపించారు. సుధీర్ బాబు నేలపై ఉన్న రక్తం తాగుతూ తపస్సులోకి వెళ్లే సన్నివేశం ఒళ్లు జలదరింపజేస్తుంది. భయానక సన్నివేశాలతో పాటు భారతీయ పురాణ వైభవాన్ని కూడా అద్భుతంగా తెరకెక్కించారు. అనంతరం నిర్వహించిన వేడుకలో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. అంతకు మించిన భావోద్వేగాలుంటాయి. ధన పిశాచి పాత్రలో సోనాక్షి సిన్హా అదరగొట్టారు. ప్రేక్షకుల డబ్బులకు విలువ ఇచ్చినప్పుడు సినిమా వంద శాతం విజయం సాధిస్తుంది. 'జటాధర' కూడా వంద శాతం హిట్ కొడుతుంది. నవంబరు 7న కుటుంబ సభ్యులందర్నీ సినిమాకు తీసుకెళ్లండి' అని అన్నారు. నటి శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత 'జటాధర'తో తెలుగులో నటించడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

విజయం సాధించాం



సిద్ధు జొన్నలగడ్డ

"'తెలుసు కదా' సినిమా చేయాలని అనుకున్నప్పుడు నా మనసులో ఒక భయం ఉండేది. ఆ భయం యాక్టర్‌గా కాదు రైటర్‌గా. ప్రతీ సన్నివేశంలో పంచులు లేకుండా ప్రేక్షకుల్ని మెప్పించగలమా అనే సందేహం ఉండేది. ఈ రోజు ఆ భయం పోయింది. థియేటర్ల ఎదుట హౌస్‌ఫుల్ బోర్డులు చూస్తుంటే మేము విజయం సాధించామనే ఆనందం కలిగింది. సినిమాకు అన్ని చోట్ల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర దర్శకురాలు నీరజ కోన మాట్లాడుతూ 'సినిమాకు వస్తున్న స్పందనను చూస్తుంటే చాలా ఎమోషనల్‌గా ఉంది. చిత్ర కథలో మేము కనెక్ట్ అయిన పాయింట్‌తో ప్రేక్షకులు కూడా అంతే అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. మా నిర్మాతలు విశ్వ గారు, కృతి గారు, హీరో సిద్ధు, హీరోయిన్లు రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి, చిత్ర బృందం మొత్తానికి కృతజ్ఞతలు' అని అన్నారు. నటుడు వైవా హర్ష మాట్లాడుతూ 'మా చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని చెప్పారు.

సందేశాత్మకం

జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. దైవ నరేశ్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'మా సినిమా ప్రచార చిత్రాలకు చక్కని స్పందన వచ్చింది. కథానుసారం తెలంగాణ యాసలో కొన్ని పాత్రలు పలికిన సంభాషణలను కొందరు విమర్శించారు, కానీ సినిమా ఎవరినీ కించపరిచేలా ఉండదు. సందేశాత్మకంగా ఉంటుంది' అని చెప్పారు. త్వరలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు తెలిపారు.





అనుబంధాలను ఆవిష్కరించే చిత్రం

'నేను నటించే సినిమాలు చాలా బావుంటాయి అనే ఇమేజ్‌ను ప్రేక్షకుల దగ్గర తెచ్చుకోవాలనేదే నా ప్రయత్నం. అది 'కె-ర్యాంప్' చిత్రంతో పూర్తిగా నెరవేరుతుందనే నమ్మకం ఉంది. కుటుంబ అనుబంధాలను తెరపై గొప్పగా ఆవిష్కరించే చిత్రమిది' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వం వహించిన చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. జైన్స్ నాని మాట్లాడుతూ 'మా సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే ప్రచార చిత్రాలతో మంచి ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమాలో డైలాగ్స్ ప్రేక్షకులకు బాగా నచ్చాయి. వాటిని ప్రేక్షకులు చెబుతుంటే చాలా సంతోషంగా అనిపించింది. ప్రథమార్థంలో ప్రేమకథా, ద్వితీయార్థంలో కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.

చిత్రజ్యోతి
SINCE 1965

పంచాయతీ సెక్రటరీ



వింటేజ్ కపుల్ శివాజీ, లయ మరోసారి కలసి నటిస్తున్న చిత్రం నిర్మాణదశలో ఉంది. ఈటీవీ విన్‌తో కలసి శివాజీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయన పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్‌గా నటిస్తున్నారు. దీపావళి పండగ సందర్భంగా ఈ చిత్రం నుంచి శివాజీ లుక్ విడుదల చేశారు. తన కుటుంబంతో కలసి దీపావళి పండగ సెలబ్రేట్ చేసుకోవడానికి పటాసులు తీసుకెళుతున్న లుక్ అది. అన్యాయాన్ని సహించని వ్యక్తిగా, నిజాయతీపరుడిగా శివాజీ ఇందులో నటిస్తున్నారు. భార్యాబిడ్డలే అతని ప్రపంచం, వాళ్ల కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడని వ్యక్తి పాత్రలో శివాజీ అభినయం ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు సుధీర్ శ్రీరామ్ చెప్పారు. చిత్రం టైటిల్, ఇతర విశేషాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. అలీ, ధనరాజ్, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

వంద శాతం హిట్ కొడతాం



సుధీర్ బాబు

సుధీర్ బాబు ప్రధాన పాత్రధారునిగా దర్శక ద్వయం వెంకటేశ్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'జటాధర'. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. తాజాగా ప్రిన్స్ మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో భూత పిశాచాలు, శాపగ్రస్త ఆలయాలు, ఆధ్యాత్మిక యుద్ధాలను కళ్లు తిప్పుకోలేని విధంగా చూపించారు. సుధీర్ బాబు నేలపై ఉన్న రక్తం తాగుతూ తపస్సులోకి వెళ్లే సన్నివేశం ఒళ్లు జలదరింపజేస్తుంది. భయానక సన్నివేశాలతో పాటు భారతీయ పురాణ వైభవాన్ని కూడా అద్భుతంగా తెరకెక్కించారు. అనంతరం నిర్వహించిన వేడుకలో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. అంతకు మించిన భావోద్వేగాలుంటాయి. ధన పిశాచి పాత్రలో సోనాక్షి సిన్హా అదరగొట్టారు. ప్రేక్షకుల డబ్బులకు విలువ ఇచ్చినప్పుడు సినిమా వంద శాతం విజయం సాధిస్తుంది. 'జటాధర' కూడా వంద శాతం హిట్ కొడుతుంది. నవంబరు 7న కుటుంబ సభ్యులందర్నీ సినిమాకు తీసుకెళ్లండి' అని అన్నారు. నటి శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత 'జటాధర'తో తెలుగులో నటించడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

విజయం సాధించాం



సిద్ధు జొన్నలగడ్డ

"తెలుసు కదా' సినిమా చేయాలని అనుకున్నప్పుడు నా మనసులో ఒక భయం ఉండేది. ఆ భయం యాక్టర్‌గా కాదు రైటర్‌గా. ప్రతీ సన్నివేశంలో పంచులు లేకుండా ప్రేక్షకుల్ని మెప్పించగలమా అనే సందేహం ఉండేది. ఈ రోజు ఆ భయం పోయింది. థియేటర్ల ఎదుట హౌస్‌ఫుల్ బోర్డులు చూస్తుంటే మేము విజయం సాధించామనే ఆనందం కలిగింది. సినిమాకు అన్ని చోట్ల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర దర్శకురాలు నీరజ కోన మాట్లాడుతూ 'సినిమాకు వస్తున్న స్పందనను చూస్తుంటే చాలా ఎమోషనల్‌గా ఉంది. చిత్ర కథలో మేము కనెక్ట్ అయిన పాయింట్‌తో ప్రేక్షకులు కూడా అంతే అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. మా నిర్మాతలు విశ్వ గారు, కృతి గారు, హీరో సిద్ధు, హీరోయిన్లు రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి, చిత్ర బృందం మొత్తానికి కృతజ్ఞతలు' అని అన్నారు. నటుడు వైవా హర్ష మాట్లాడుతూ 'మా చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని చెప్పారు.

సందేశాత్మకం

జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. దైవ నరేశ్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'మా సినిమా ప్రచార చిత్రాలకు చక్కని స్పందన వచ్చింది. కథానుసారం తెలంగాణ యాసలో కొన్ని పాత్రలు పలికిన సంభాషణలను కొందరు విమర్శించారు, కానీ సినిమా ఎవరినీ కించపరిచేలా ఉండదు. సందేశాత్మకంగా ఉంటుంది' అని చెప్పారు. త్వరలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు తెలిపారు.





అనుబంధాలను ఆవిష్కరించే చిత్రం

'నేను నటించే సినిమాలు చాలా బాగుంటాయి అనే ఇమేజ్‌ను ప్రేక్షకుల దగ్గర తెచ్చుకోవాలనేదే నా ప్రయత్నం. అది 'కె-ర్యాంప్' చిత్రంతో పూర్తిగా నెరవేరుతుందనే నమ్మకం ఉంది. కుటుంబ అనుబంధాలను తెరపై గొప్పగా ఆవిష్కరించే చిత్రమిది' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వం వహించిన చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. జైన్స్ నాని మాట్లాడుతూ 'మా సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే ప్రచార చిత్రాలతో మంచి ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమాలో డైలాగ్స్ ప్రేక్షకులకు బాగా నచ్చాయి. వాటిని ప్రేక్షకులు చెబుతుంటే చాలా సంతోషంగా అనిపించింది. ప్రథమార్థంలో ప్రేమకథా, ద్వితీయార్థంలో కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.

క్షణికావేశంలో తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దు

● యువతకు సీఐ సుబ్బారావు సూచన

చీరాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : క్షణికావేశంలో యువతీ యువకులు, ప్రజలు క్షణికావేశంలో తీవ్ర నిర్ణయాలు తీసుకోరాదని వన్‌టైన్ సీఐ సుబ్బారావు సూచించారు. శుక్రవారం పట్టణంలో 17 సంవత్సరముల మైనర్ బాలిక లగేజీతో అనుమానస్పదంగా సంచరిస్తుండగా, శక్తీ టీం గుర్తించింది. దీంతో ఆమెతో మాట్లాడి విషయం తెలుసుకోగా తల్లిదండ్రులతో గొడవపడి బయటకు వచ్చేసినట్లు చెప్పడంతో వెంటనే ఆమెను సీఐ స్టేషన్‌కు పిలిపించి, తల్లిదండ్రులతో కౌన్సిలింగ్ చేశారు. ఒంటరిగా చిన్నారులు బయటకు వెళ్లడం ప్రమాదమని సూచించారు. సీఐ వెంట ఎస్సై రాజ్యలక్ష్మీ, సిబ్బంది ఉన్నారు.

నూజెళ్లపల్లె సాగర్ కాలువ డ్రాప్ వద్ద గండి

● వృథాగాపోతున్న జలాలు



వృథాగాపోతున్న సాగర్ జలాలు

పంగులూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూజెళ్లపల్లె గ్రామానికి దక్షిణంగా ఉన్న సాగర్ మైనర్ కాలువ పరిధిలో డ్రాపు శిథిలావస్థకు చేరింది. దీంతో సాగర్‌జలాలు వృథాగా పోతున్నాయని టీడీపీ గ్రామ నాయకులు గొట్టిపాటి కాజా అన్నారు. డ్రాప్ వద్ద నుంచి నీరు ముందకు నడవడం లేదని, ఎగువనుండి వచ్చే సాగర్‌కాలువ నీరు ముందుకుపోవడం లేదన్నారు. నీరు వృథాగా పంట పొలాల్లోనికి పారుతోందని దీంతో పొలాలు దెబ్బతింటున్నాయని స్థానిక రైతులు వాపోతున్నారు. అధికారులకు తెలియజేసినా వారు స్పందించడం లేదని ఆరోపించారు. సాగర్‌కాలువ డ్రాపునకు తగిన మరమ్మత్తులు చేపట్టి నీటిపారుదలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు.

జెండా పండుగలో పాల్గొన్న గౌరీఅమర్నాథ్

దేశాయిపేట(చీరాల), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం దేశాయిపేటలో నిర్వహించిన జెండా పండుగ వేడుకల్లో శుక్రవారం రాత్రి టీడీపీ యువనాయకులు గౌరీఅమర్నాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు, ముస్లింలు నిర్వాహకులు నిర్వహించిన పవిత్ర ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆయన వెంట కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యోగులకు 010 కింద వేతనాలు ఇవ్వాలి

● ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దు కింద వేతనాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో శుక్రవారం టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్.సూర్యనారాయణ వీడియో సందేశాన్ని వినిపించారు. అనంతరం కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, బకాయిలు విడుదల చేయాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జీవీ శివారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు పీవీ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరెడ్డి, సంఘం నాయకులు ఎం.శ్రీనివాసరావు, ఎ.ప్రసాద్, ఎ.భాస్కరరావు, ధనమ్మ, జి.శాంసన్, వై.మృదుల్‌కుమార్, లక్ష్మి, కొడమల శాంసన్, గ్రంథాలయ సంస్థ పెన్షనర్స్ అధ్యక్షుడు డీవీ.సుబ్బారెడ్డి, ఓబీవీ. సుబ్బారావు, డి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నిధుల వినియోగంలో జాప్యం చేస్తే సస్పెండే

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదు

కలెక్టర్ రాజాబాబు హెచ్చరిక



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని కలెక్టర్ రాజాబాబు హెచ్చరించారు. మండల స్థాయిలో అభివృద్ధి అధికారులకు గ్రామాభివృద్ధే ప్రధాన కర్తవ్యం అని, నిర్లక్ష్యంచేస్తే చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు. ఎస్సీ ప్రజలు అధికంగా ఉండే గ్రామాల్లో పీఎం-ఏజేఏవై పథకం అమలు తీరుపై శుక్రవారం స్థానిక కలెక్టర్ సమావేశపు హాలులో జిల్లా స్థాయి కన్వర్జెన్సీ సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా జిల్లా సాంఘికసంక్షేమశాఖ అధికారి లక్ష్మానాయక్ ఈపథకంలో భాగంగా గ్రామ స్థాయిలో విద్య, వైద్యం, తాగునీరు, పారిశుధ్యం, సామాజిక భద్రత, గ్రామీణ రోడ్లు, ఇళ్ల నిర్మాణం, విద్యుత్, మెరుగైన వ్యవసాయం తదితర అంశాలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆయా అంశాలపై కలెక్టర్ స్పందిస్తూ వచ్చిన నిధులను వినియోగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఫేజ్-1లో మంజూరైన పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శుల పనితీరును కూడా నిరంతరం పరిశీలిస్తూ ఉండాలని ఎంపీడీవోలను ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు చిరంజీవి, బాలశంకరరావు, నారాయణ, కిరణ్‌కుమార్, వరలక్ష్మీ, వెంకటేశ్వర్లు, అశోక్ పాల్గొన్నారు.

మంత్రి వచ్చాక మరుగుదొడ్లు శుభ్రమయ్యాయ్..

ఆ గురుకుల పాఠశాలలో లోపల ఎలా ఉంటుందో తెలియదు గాని బయటకు మాత్రం జాతీయ రహదారి వెంబడే ఆహ్లాదకర వాతావరణంలో కనిపిస్తోంది. కానీ గురువారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి ఆకస్మిక తనిఖీ చేసి పాఠశాలలో ఉన్న లోపాలు గుర్తించటంతో ఇప్పుడు అందరినోట ఆ పాఠశాల మాట వినబడుతోంది. అదే త్రిపురాంతకం మండలం దూపాడులోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల. మీడియాను, స్థానిక నాయకులను కూడా వెంట రానీయకుండా మంత్రి స్వయంగా పాఠశాల పరిస్థితిని పర్యవేక్షించి సిబ్బందిని హెచ్చరించి లోపాలు సరిదిద్దుకోవాలని, విద్యార్థినులకు ఇబ్బంది కలిగిస్తే సహించనని హితబోధ చేశారు. అంతే శుక్రవారం చకచకా లోపల నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను శుభ్రపరిచి, అల్లుకున్న నిర్లక్ష్యపు తీగలు, చెట్లు తొలగింపు చేపట్టి మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకొచ్చారు. మంత్రి ఆదేశాలతో శుభ్రపరిచామని ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో ఉంచారు. అంటే మంత్రి వస్తేగాని మరుగుదొడ్లు శుభ్రం కావా అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

- త్రిపురాంతకం, ఆంధ్రజ్యోతి



తెలుగు వెలుగులు చాటిన గొట్టిపాటి రమణ

● ఖతార్‌లో తెలుగు ప్రవాసీ సంఘ సభ్యుడిగా కామేపల్లి వాసి విజయం

● టీడీపీ ఎన్ఆర్ఐ విభాగంలో కీలక బాధ్యతలు



గొట్టిపాటి రమణ

జరుగుమల్లి (కొండపి), అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : జరుగుమల్లి మండలం కామేపల్లికి చెందిన గొట్టిపాటి రమణ గల్ఫ్‌లోని ఖతార్ దేశంలో ఉంటూ తెలుగు వెలుగులను చాటాడు. అక్కడ జరిగిన తెలుగు ప్రవాసీ సంఘం ఎన్నికల్లో తనతోపాటు మరో 9మందిని గెలిపించడంలో రమణ కీలకపాత్ర పోషించారు. తెలుగు వారికి అండగా, టీడీపీ విభాగంలో కీలకంగా పనిచేస్తున్నారు. భారతీయ ఎంబసీ ఆధ్వర్యంలోని ఐసీసీ అనే భారతీయ సంఘాల సమాఖ్య పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరగ్గా విజయంలో రమణ కీలకపాత్ర పోషించారు. కామేపల్లి నుంచి 20 ఏళ్ల క్రితం ఖతార్ వెళ్లిన రమణ అక్కడ ప్రముఖ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. జిల్లాకు చెందిన అనేక మంది ఇంజనీర్లకు ఉద్యోగ, ఉపాధి కల్పనలోనూ, పేదలకు విద్యనందించడంతోపాటు, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు అండదండలు అందిస్తున్నారు. రమణకు ఇద్దరు కుమార్తెలు వైద్య విద్యలో పీజీ చేస్తున్నారు. తమ గ్రామానికి చెందిన రమణ ఖతార్‌లో పేరు ప్రఖ్యాతులు సాధించడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంగులూరులో నేత్రదానం

పంగులూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పంగులూరులో శుక్రవారం నేత్రదానం నిర్వహించారు. గ్రామానికి చెందిన పెంట్యాల వెంకటనారాయణ(ఉరఫ్ ముఖ్యమంత్రి) మరణిచాడు. స్థానిక రోటరీక్లబ్ సహకారంతో కుటుంబసభ్యులు ఆయన నేత్రాలను దానం చేసేందుకు ముందుకొచ్చారు. ఆ సమాచారాన్ని రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ బత్తుల వీరనారాయణ, రాయిణి రామారావులు కాకాణికి చెందిన శంకర్ నేత్రాలయం వారికి తెలియజేశారు. పంగులూరు చేరుకున్న శంకర్‌కంటి వైద్యశాల సిబ్బంది మృతుడు వెంకటనారాయణ కంటి కార్నియాను సేకరించారు.

డ్రై క్లీనింగ్ దుకాణంలో అగ్ని ప్రమాదం



దగ్ధమైన డ్రై క్లీనింగ్ సెంటర్

మేదరమెట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మేదరమెట్ల బస్టాండ్ సెంటర్ సమీపంలోని డ్రై క్లీనింగ్ దుకాణంలో శుక్రవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో దుకాణంలోని సామగ్రి, వస్తువులు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అద్దంకి అగ్ని మాపక సిబ్బంది ఘటన స్థలాన్ని పరిశీలించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సుమారు లక్ష రూపాయలు ఆస్తి నష్టం సంభవించిందని, దుకాణం యజమాని స్వరూపదేవి తెలిపారు.

పవన్ గోపీకృష్ణకు సీఎం అభినందన



గోపీకృష్ణను అభినందిస్తున్న సీఎం

పంగులూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ వ్యాసరచనలో జిల్లాస్థాయిలో సత్తాచాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైన కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థి సీ.హెచ్. పవన్ గోపీకృష్ణను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభినందించారు. సూపర్ జి.ఎస్.టి, సూపర్ సేవింగ్స్ పోటీలలో రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన పవన్‌గోపీకృష్ణ ఈ నెల 16న కర్నూల్‌లో ప్రధాని నరేంద్రమోడీతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభించింది. కర్నూల్‌లో జరిగిన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ సభ ముగిసిన అనంతరం రాష్ట్రస్థాయిలో ఈ అంశంపై ప్రతిభచాటిన పది మంది విద్యార్థులు శుక్రవారం ఉండవల్లి లోని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిశారు. ఈ సందర్భంగా పవన్‌గోపీకృష్ణను సీఎం అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభచాటి ముఖ్యమంత్రితో ప్రశంసాపత్రం అందుకున్న పవన్‌గోపీకృష్ణను గ్రామపెద్దలు చింతల సహదేవుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బత్తుల వెంకటరావు, బొప్పూడి నాగేశ్వరరావు, హెచ్ఎం అనిత పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

వేటపాలెం(చీరాల), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం బాలికోన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు దేవరకొండ సరోజని స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు. శుక్రవారం పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు సరళాదేవీ, ఉపాధ్యాయులు ఉచితంగా ఏర్పాటు చేసిన పంపిణీ కార్యక్రమంలో ప్రధానోపధ్యాయురాలు మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ రూపొందించిన బ్లూప్రింట్ ఆధారంగా మెటీరియల్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, అంజమ్మ, రాంబాబు, సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మంత్రి రవికుమార్ పర్యటన

అద్దంకి, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం జరిగే పలు కార్యక్రమాలకు విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ హజరు కానున్నారు. ఉదయం 11 గంటలకు అద్దంకి పట్టణంలోని శింగరకొండ రోడ్డులోని కాకానిపాలెం హైస్కూల్‌లో విద్యార్థులకు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సైకిళ్లు పంపిణీ చేయనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు బంగ్లారోడ్డులో జరిగే సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ అవగాహన ర్యాలీలో పాల్గొననున్నారు.

అవీ..ఇవీ..

బాలికలకు ఆటల పోటీలు

మార్టూరు, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని కోలలపూడి జడ్పీ హైస్కూల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికలకు ఆటలపోటీలను నిర్వహించారు. అనంతరం ఈ పోటీలలో గెలుపొందిన బాలికలకు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజరు పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మ, సువర్ణ, సుధ, కవిత, రాసిగ్న తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలపై వరల్డ్ హెల్త్ టీం సర్వే

బల్లికురవ, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకునేందుకు జిల్లా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ టీం సభ్యులు మండలంలోని సోమవరప్పాడు గ్రామంలో సర్వే చేశారు. ముందుగా గుంటుపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసిన వారు అనంతరం వారు ఉప్పుమాగులూరు పంచాయతీ శివారు గ్రామం అయిన సోమవరప్పాడులో పది గృహాలకు వెళ్లి ప్రభుత్వం ద్వారా ప్రజలకు ఎలాంటి వైద్య వసతులు అందుతున్నాయి. అని వారిని అడిగి తెలుసుకున్నారు. అలానే అన్ని రకాల వ్యాక్సిన్లు వేస్తున్నారా లేదా అని పరిశీలన చేశారు. ప్రజలు కూడా ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. గ్రామాలలో ఉన్న హెల్త్ సబ్ సెంటర్లు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వారు వివరించారు. ఈ పరిశీలనలో గుంటుపల్లి వైద్యశాల ఎంపీహెచ్‌ఈవో వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం హసీనా, ఆశావర్కర్ లక్ష్మీశ్రావణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌లో రావినూతల విద్యార్థినికి ప్రథమస్థానం

మేదరమెట్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌లో రావినూతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రథమస్థానంలో నిలిచింది. శుక్రవారం చీరాలలోని ఎన్ఆర్‌పీఎం హైస్కూల్‌లో 'క్వాంటమ్ ఏజ్ బిగిన్స్, పొటెన్షియల్స్ అండ్ ఛాలెంజెస్' అనే అంశంపై జిల్లా స్థాయి సెమినార్ నిర్వహించారు. రాత పరీక్ష, ప్రజెంటేషన్, క్విజ్ అనే మూడు సాధనాల ద్వారా విద్యార్థులను న్యాయ నిర్ణేతలు పరీక్షించి విజేతలను ఎంపిక చేశారు. ఈ పోటీలో రావినూతల జెడ్పీహెచ్ఎస్ నుంచి 9వ తరగతి చదువుతున్న సీహెచ్. మధువర్షిత పాల్గొని ప్రతిభ కనబరిచి, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్రస్థాయికి ఎంపికైందని హెచ్ఎం తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన మధువర్షితను పాఠశాల హెచ్ఎం ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్, గ్రామస్థులు అభినందించారు.


మధువర్షిత

శాస్త్రీయ జ్ఞానంతో ఉన్నత శిఖరాలు

● చీరాల డివిజన్ ఉప విద్యాశాఖాధికారి గంగాధరరావు

చీరాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు శాస్త్రీయ జ్ఞానాన్ని సాధించడం వలన ఉన్నత శిఖరాలు చేరుకుంటారని చీరాల డివిజన్ ఉప విద్యాశాఖాధికారి గంగాదరరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్ఆర్ అండ్‌పీఎం హై స్కూల్లో జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించారు. పోటీ పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సాధిక్, ప్రధానోపాధ్యాయులు సాల్మన్‌రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రశంసాపత్రాలతో విజేతలు

గుండ్లకమ్మ నది శుభ్రపడేదెప్పుడో..!

స్నానాల ఘాట్‌లు ఏర్పాటు చేస్తే అభివృద్ధికి అవకాశం

అద్దంకి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు గుండ్లకమ్మ నదిలో పవిత్ర స్నానాలు, కార్తీక స్నానాలు చేసే వారు.. అయితే ప్రస్తుతం అటు వైపు వెళ్లే పరిస్థితి కూడా లేకుండా పోయింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లు కొట్టుకుపోయి నీరు నిల్వ లేకుండా పోయింది. దీంతో అద్దంకి పట్టణం సమీపంలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు జరిగాయి. చిట్టడవిని తలపించేలా చెట్టు, జమ్ము పెరిగింది. ప్రస్తుతం గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో నీరు నిలిచి ఉంది. అద్దంకి సమీపంలో కూడా గుండ్లకమ్మ నది నిండా నీరు నిలిచింది. అయితే పెద్ద ఎత్తున చిల్లచెట్లు, జమ్ము ఉండడంతో అటు వైపు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. అద్దంకి పట్టణం సమీపంలో గుండ్లకమ్మ నది ప్రాంతాన్ని శుభ్రం చేసి స్నానాల ఘాట్‌లు ఏర్పాటు చేయాలని పలుమార్లు అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రజాప్రతి నిధులకు, అధికారులకు వినతి పత్రాలు కూడా ఇచ్చారు. ఈ నేపథ్యం లోనే గత ఏడాది గుండ్లకమ్మ నది ప్రాంతం సర్వే కూడా చేశారు. అయితే అనంతరం ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. అద్దంకి పట్టణానికి ఆనుకొని గుండ్లకమ్మ నది ప్రవహిస్తున్న నేపథ్యంలో స్నానాల ఘాట్‌లు, పార్కులు అభివృద్ధి చేస్తే అటు భక్తులు, ఇటు ప్రజలకు ఉపయోగకరంగా మారే అవకాశం ఉంది. గుండ్లకమ్మ నదిని అభివృద్ధి చేస్తే గతంలో వలే దీక్షా భక్తులు కార్తీక స్నానాలు చేసేందుకు, మహిళలు పవిత్ర స్నానాలు చేసేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించి గుండ్లకమ్మ నదీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.


దట్టంగా పెరిగిన తుమ్మచెట్లు, జమ్ము


నదిని పూర్తిగా కమ్మేసిన తూటకాడ

కోనంకి -వలపర్ల రోడ్డులో కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు

రెండురోజుల నుంచి ముమ్మరంగా పనులు

మార్టూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోనంకి నుంచి వలపర్ల గ్రామానికి వెళ్లే రోడ్డు ప్రక్కన కొత్తగా విద్యుత్ స్థంభాలను ఏర్పాటు చేస్తున్నారు. రెండు మూడు రోజుల నుండి రోడ్డు పక్కన పాత స్థంభాలను, శిథిలమైన వాటిని తొలగించి, వాటి స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటుచేస్తున్నారు. వాస్తవంగా చాలా కాలం క్రితం రోడ్డుపక్కన ఏర్పాటుచేసిన విద్యుత్ స్తంభాలు శిథిల దశకు చేరి పడిపోయే దశలో ఉన్నాయి. వర్షాలు కురిసినా, గాలులు వీచినా కరెంటు తీగలు తెగిపోయి, విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడుతోంది. దానికితోడు రోడ్డుపక్కన సుబాబుల్ చెట్లు, కొమ్మలు విద్యుత్ తీగలకు తగలడంతో పలుమార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. వాటిని తిరిగి బాగు చేసి విద్యుత్ సరఫరాను చేయడం విద్యుత్ సిబ్బందికి శ్రమతో పాటు సమయం కూడా జాప్యమవుతోంది. ఈ సమస్యపై ప్రత్యేక దృష్టిసారించిన మార్టూరు సబ్ డివిజన్ విద్యుత్ డీఈఈ ఎం. సురేంద్రబాబు ఉన్నత అధికారులతో మాట్లాడి, ముందుగా పాత స్తంభాలను తొలగించాలని, వాటి స్థానంలో కొత్త స్తంభాల ఏర్పాటుకు అనుమతులు పొందడంతోపాటు, కొత్త స్తంభాలు వచ్చే విధంగా కృషి చేశారు. దీంతో కొత్తస్తంభాలు, కొత్తగా తీగలను ఏర్పాటుచేస్తున్నారు. ఇక స్తంభాల వెంబడి చెట్లను కూడా తొలగిస్తు న్నారు. అదేవిధంగా వలపర్ల గ్రామంలో కూడా ఏళ్ల తరబడి శిథిలమైన స్తంభాల కారణంగా కరెంటు తీగలు కిందకు వేలాడుతుండటంతో అధికారులు ప్రత్యేకంగా చర్యలను తీసుకుంటున్నట్లు శుక్రవారం విద్యుత్ ఏఈ జి.రామాంజనేయులు తెలిపారు.


నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయిస్తున్న అధికారులు

గ్రామీణ ప్రజల సమస్యల పరిష్కారానికి విశేష కృషి

● ఘనంగా మాజీ ఎంఎల్‌సీ మాణిక్యరావు శతజయంతి
● ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

చీరాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రజల సమస్యల పరిష్కారానికి మాజీ ఎంఎల్‌సీ మాణిక్యరావు విశేష సేవలు అందించారని మాజీ ఎంఎల్‌సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ గారపాటి పుష్పరాజ్ ఆధ్వర్యంలో శత జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాణిక్యరావు కుమారుడు విజయ్‌కుమార్, గుంటూరు ఏసీ కళాశాల ప్రిన్సిపల్ మోజెస్, విద్యాసాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

రేపు బాపట్ల జిల్లా హేతువాద సంఘ మహాసభలు

ఇంకొల్లు, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి) : చీరాల రైల్వే ఫ్లైఓవర్ కింద ఉన్న ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో బాపట్ల జిల్లా హేతువాద సంఘ మహాసభలు హేతువాద మానవవాద అధ్యయన తరగతులు ఈ నెల 19 నుంచి జరుగుతాయని భారత హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి మేడూరి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభలకు ప్రముఖ హేతువాదులు హాజరై పలు అంశాలపై చర్చిస్తారన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

చీరాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘం పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు అన్నారు. శుక్రవారం 1వ వార్డు రామనగర్, 15వ వార్డు యాదవపాలెం ప్రాంతాల్లో పర్యటించి డ్రెయినేజీ పనులను పరిశీలించారు. పారుదల లేని డ్రెయిన్లపై ఎమ్మెల్యే కొండయ్య సూచనల మేరకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. నిర్మాణాలకు సంబంధించి పలు సూచనలు చేశారు. అలాగే 4వ వార్డులో ఫిష్ మార్కెట్ స్థలాన్ని పరిశీలించి వ్యాపారులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. చైర్మన్ వెంట ఏఈ రవికుమార్, కౌన్సిలర్ జగదీష్ తదితరులు ఉన్నారు.


డ్రెయినేజీని పరిశీలిస్తున్న చైర్మన్

మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోండి

● కెరీర్ గైడెన్స్ కౌన్సిలర్ ఇందిరా ప్రియదర్శిని


అవగాహన కల్పిస్తున్న అధికారులు

చినగంజాం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని, జిల్లా కెరీర్ గైడెన్స్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ జి.ఇందిరా ప్రియదర్శిని, ఎంఈవో-1 బి.అజయ్‌బాబులు అన్నారు. రాష్ట్ర సమగ్రశిక్ష వారి ఆధ్వర్యంలో స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం, జూనియర్ కళాశాలలోని విద్యార్థినులకు మానసిక ఆరోగ్యంపై శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలోని కౌమార దశ బాలికలకు వారి కౌమారదశ సమస్యలు, ఆరోగ్యం, వ్యక్తిగత భద్రత, విద్యకు సంబంధించి రెండురోజులు పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.సుమాంజలి తెలిపారు. పదో తరగతి, ఇంటర్‌మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థినులకు ప్రేరణ, కౌమారదశ సమస్యలు, అధ్యయన ప్రణాళిక, బుద్ధి పూర్వకత తదితర అంశాలపై కార్యకలాపాలను నిర్వహించినట్లు ఇందిరా ప్రియదర్శిని తెలిపారు. ముగ్గురు విద్యార్థినులకు వ్యక్తిగత సెషన్ నిర్వహించి, వారి వ్యక్తిగత సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి పలు సూచనలు ఆమె అందజేశారు. ఉపాధ్యాయుల ఓరియంటేషన్ సెషన్‌లో ఎంఈవో పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కొప్పెరపాడులో కుక్కల దాడిలో మరో గొర్రె మృతి

● రెండవరోజు గొర్రెను చంపిన గ్రామసింహాలు

బల్లికురవ, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొప్పెర పాడు గ్రామంలో వీధి కుక్కలు రెండో రోజు కూడా హల్‌చల్ చేశాయి. గురువారం షేక్ వలి అనే రైతుకు చెందిన 16 పోటేళ్లను కుక్కలు కరవడంతో మృతి చెందాయి. శుక్రవారం కూడా వీధి కుక్కలు మరో గొర్రెను కరిచి చంపాయి. దీంతో గ్రామంలో గొర్రెల కాపరులు బెంబేలెత్తి పోతున్నారు. వీధికుక్కల తాకిడి రోజురోజుకు అధికం అయిందని వీధుల వెంట గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయని అధికారులు వెంటనే వీధి కుక్కలను పట్టే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


మృతిచెందిన గొర్రె

సీసీ రోడ్లపై పారుతున్న మురుగు నీరు

● కొన్ని నెలలుగా అందుబాటులో లేని గ్రామ ప్రజాప్రతినిధి


రోడ్డుపై పారుతున్న మురుగునీరు

బల్లికురవ, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్ పరిశ్రమలతో కళకళలాడే వేమవరంలో పారిశుధ్యం పడకేసింది. మురుగు కాలువల్లో వ్యర్థాలు తీయకపోవడంతో గ్రామంలో ఎటూ వైపు చూసిన రోడ్లపైనే మురుగు నీరు పారుతోంది. గ్రామంలో ప్రధాన రోడ్డులో అయితే మురుగు విలయ తాండవం చేస్తోంది. గ్రామ సర్పంచ్ కొన్ని నెలల నుంచి గ్రామంలోకి రాలేదని పారిశుధ్య పనులు చేయించడం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలక ముందే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. పట్టణ ప్రాంతంలో ఉన్న సర్పంచ్‌కు అధికారులు ఫోన్ చేస్తే నేను సర్పంచ్ పదవికి రాజీనామా చేశానని చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు. దీంతో ఎవరు పారిశుధ్య పనులు చేయించలేక పోతున్నారు. పరిశ్రమలతో పన్నులు కూడా పెద్దఎత్తున గ్రామ పంచాయతీకి వస్తున్నాయని అధికారులు వెంటనే గ్రామంలో పారిశుధ్య పనులు చేయించాలని, సర్పంచ్ అందుబాటులో లేకుంటే అధికారులే పనులు చేయించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి సహకారం

● రూ.40లక్షల విరాళాన్ని అందించిన జనసేన నేత శ్రీకాంత్
● ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘన సన్మానం

పర్చూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు వై.జంక్షన్‌లో వేంచేసిన 95 అడుగుల శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ దేవస్థానంలో వంటశాల నిర్మాణానికి ప్రవాసాంధ్రుడు, జనసేన నేత మన్నెం శ్రీకాంత్ రూ.40 లక్షల విరాళాన్ని అందజేసి భక్తిని చాటుకున్నారు. ప్రస్తుతం ఆలయంలో జరుగుతున్న నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం దుశ్శాలువా పూలమాలతో శ్రీకాంత్‌ను ఆలయ కమిటీ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కోటా హరిప్రసాద్, కఠారి సురేంద్రబాబు, తులసి శివనాగేశ్వరరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, గోగుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.


మన్నెం శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

నూతన పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు

పంగులూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు ఎస్సీ కాలనీలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలను సమగ్ర శిక్ష ఏపీసీ నాగిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఆగస్టు నెలలో గ్రామంలో పర్యటించిన రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు కాలనీవాసులు పాఠశాల దుస్థితిపై చేసిన విజ్ఞప్తిపై మేరకు చందలూరు ఎస్సీ కాలనీలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలను పరిశీలించి వాటి స్థానంలో నూతన భవననిర్మాణం చేపట్టాల్సిన అవసరాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించిన ఏపీసీ నాగిరెడ్డి త్వరలో నూతన భవనం నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. విద్యార్థుల విద్యా స్థాయిని పరిశీలించి పాఠశాల ఉపాధ్యాయుల పనితీరుపట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. కాలనీ వాసులతో మాట్లాడారు. వీరివెంట సమగ్ర శిక్ష ఈఈ నాగజ్యోతి, ఎంఈవో జి.వీరాంజనేయులు, పాఠశాల హెచ్‌ఎం అద్దంకి శ్రీధర్ పాల్గొన్నారు.


కాలనీవాసులతో మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏఎంసీ నాగిరెడ్డి

ప్రజలకు అండగా వైసీపీ కోటి సంతకాలు

రామకృష్ణాపురం(చీరాల), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద ప్రజలకు అండగా ఉండేందుకే వైసీపీ కోటి సంతకాల సేకరణ నిర్వహిస్తున్నట్లు నియోజక వర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. ఆ పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమం శుక్రవారం వైసీపీ క్యాంపు కార్యాలయం, దేశాయిపేట, వేటపాలెం గ్రామాల్లో నియోజకవర్గ పరిశీలకులు మోదుగుల బసవపున్నారెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసేందుకు పూనుకున్న పన్నాగాన్ని తిప్పి కొడతామన్నారు. పోస్టర్ ఆవిష్కరణ చేశారు. వారివెంట పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కరణం వెంకటేష్

కోటిసంతకాల సేకరణ

అద్దంకి : వైద్యకళాశాల ప్రవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమం శుక్రవారం రాత్రి అద్దంకి పట్టణంలోని 5వ వార్డు పరిధిలో ఉన్న రాజీవ్‌కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ వైద్యకళాశాలల ప్రవేటీకరణను కూటమి ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ అద్దంకి పట్టణ పార్టీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, మాజీ ఎంపీపీ జ్యోతి హనుమంతరావు, కొల్లా భువనేశ్వరి, ఫణి తదితరులు పాల్గొన్నారు.